జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 4 పక్షపత్రిక ఫిబ్రవరి 16-29, 2012



## స్వర్ణాంధ్ర + హరితాంధ్ర = మద్యాంధ్రప్రదేశ్

## మద్యం సిండికేట్లలో సా.రా. పార్టీల కుమ్మక్కు



కె.పి.హెచ్.బి. కాలనీలో జేపీ పాదయాత్ర



నరసరావుపేటలో ఎడ్లబండిమీద జేపీ



డా॥ జయప్రకాష్ నారాయణ్ తన సహచర విద్యార్థులతో... (గుంటూరు)



పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో జేపీ ...






కృష్ణా జిల్లా విజయవాడ
లయోలా కళాశాలలో మాట్లాడుతున్న జేపీ





గుంటూరు జిల్లా నరసరావుపేట
కృష్ణవేణి కళాశాలలో మాట్లాడుతున్న జేపీ

జన రాజకీయం కోసం...
# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి16-29, 2012
సంపుటి - 3 సంచిక - 4

## లోపలి పేజీల్లో...

తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే...................... 5
ఆసియాదేశాలలో భారత్ బ్యూరోక్రసీ ఫ్లాప్.... 7
పాఠశాలగా మారిన అవినీతి మేడ................ 8
స్వర్ణాంధ్ర + హరితాంధ్ర = మద్యాంధ్రప్రదేశ్..... 9
మద్యం వ్యాపారం ప్రభుత్వమే నిర్వహించాలి... 13
విదేశాల్లో దాచిన నల్లధనం 24.5 లక్షల కోట్లు . 16
ఆంధ్రప్రదేశ్ 'అసర్' సర్వే ఫలితాలు................ 17
ఓటు హక్కు వినియోగించుకోని పౌరులు....... 20
అవినీతిరహిత ఒంగోలు -పిఎఫ్ఎల్ ............. 22
మాట్లాంలో మంచినీటి ఆర్.ఒ. ప్లాంట్...........25
రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు....... 26
ఉత్తరప్రదేశ్ షుగర్‌మిల్స్‌కు చుక్కెదురు.......... 27
లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు...................... 28

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# ఐఏయస్ వ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టండి

## సంపాదకీయం

ఐఏయస్ వ్యవస్థ రాను రాను తన ప్రతిష్టను కోల్పోతున్నది. రాష్ట్రంలో ఇప్పటికే ఇద్దరు ఐఏయస్‌లు అరెస్టయి వున్నారు. మరికొందరు ఆరోపణలను, విచారణలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులలో ఐఏయస్‌ల సంఘం తన వ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టడానికి తగిన చర్యలు తీసుకుంటుందని అందరూ భావించడం సహజం. కాని దీనికి విరుద్ధంగా ఈ పెద్దల సంస్థ తన సభ్యుల స్వీయరక్షణకే ప్రాధాన్యతనిచ్చి ఇతరుల మీద విరుచుకుపడడం ఆ వ్యవస్థ ప్రతిష్టను పెంచేదిగా లేదు.

మన పాలనారంగంలో ఐఏయస్ వ్యవస్థ అత్యంత కీలకమైంది, అత్యంత ప్రతిష్ఠాత్మకమైంది. వారు ఎవరికీ తలొగ్గకుండా రాజ్యాంగానికి, చట్టానికీ బద్ధులుగా తమ కార్యకలాపాలు స్వేచ్ఛగా సాగించుకోడానికి వీలుగా రాజ్యాంగం వీరికి ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని రక్షణలు కల్పించింది. అందుకే దీనిని ఉక్కు చట్రంగా అభివర్ణిస్తూ వుంటారు. ఆ ఉక్కుకే ఇప్పుడు తుప్పు పట్టినట్లు స్పష్టం అవుతున్నది. కొందరు ఐఏయస్‌లు లాలూచీ అవినీతిలో భాగం అవుతున్నారు. స్వప్రయోజనాల కోసం మంత్రులు ఆదేశాలకు జీ హుజూర్ అంటున్నారు. పాలకుల ఆజ్ఞలకు తలవంచి సంతకాలు పెట్టే గుమాస్తాలుగా తయారుకావడం ఈ వ్యవస్థకు పట్టిన దురవస్థ తప్ప వేరు కాదు.

మంత్రులకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండా జీవోలు రావని, విధానపరమైన నిర్ణయాలు జరగవని వాటిని నిర్దేశిస్తున్న వారిని వదిలిపెట్టి సంతకం చేసిన వారిపై చర్యలు తగదని సంఘం చేస్తున్న వాదన అసంబద్ధమైంది. అలాంటి మంత్రుల్ని శిక్షించాల్సిందే. కాని ఐఏయస్‌లు ఎందుకు తలొగ్గి వ్యవహరిస్తున్నారు. నోట్‌ఫైల్ పై అభిప్రాయాలు రాయకుండా ఎందుకు 'సై' అంటున్నారు. ఇది కేవలం లొంగుబాటుతనం కాదు. అవినీతికి సహకరించడం, భాగస్వాములు కావడం మాత్రమే అవుతుంది. పాలకుల ఆదేశాలు పాటించకపోతే ట్రాన్స్‌ఫర్లు తప్ప వారికి జరిగే నష్టం ఏమిటో వారే చెప్పాలి. ఇక్కడ కాదనుకుంటే కేంద్రానికి తిరిగి వెళ్లే అవకాశం వుంది. వారు తమ విద్యుక్త ధర్మాన్ని విస్మరించారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా వ్యవహరించడానికి ఉద్దేశించిన ఈ వ్యవస్థ లక్ష్యాన్ని వారు విస్మరించారు.

ఇక పెద్ద చేపల్ని వదిలి చిన్న చేపల్ని పట్టుకోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ కుంభకోణాల్లో తమ వాటా చిన్నదే అని ఒప్పుకుంటూ దానిని విడిచిపెట్టాలనడంలో సబబు ఏమిటో వారే చెప్పాలి.

చివరిగా ఐఏయస్‌ల సంఘం ఈ విషయంలో ఒకట్రేడ్ యూనియన్‌లా ఆందోళనలు, పెన్‌డౌన్‌లు, కోర్టుకెక్కడాలు వంటి ఆలోచనలు చెయ్యడం పూర్తి అసంగతమైంది.

ఏమైనా ఇప్పటికే ఐఏయస్ వ్యవస్థలో చాలా మంది నిటారుగా నిలబడినవారు, ఇంకా నిలబడుతున్నవారు చాలామంది వున్నారు. అలాంటివారు లేకపోతే ఈ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయేది. దీనిని అందరూ ప్రోత్సహించాలి. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**
సెల్ : *80085 07934*

విడి ప్రతి : రు. **10** ,
ఏడాది చందా : రు. **200**
మూడేళ్ళ చందా : రు. **500**

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే!

***నాయకులా, ఐపీఎస్‌లా అన్న తేడా లేదు దోపిడికి సహకరించడం నేరమే అధికారులు బాధ్యత నుంచి తప్పించుకోలేరు. నిజాయతీపరులను ఇబ్బంది పెట్టకూడదు 'ఈనాడు-ఈటీవీ' ఇంటర్వ్యూలో జేపీ వ్యాఖ్యలు.***

***తప్పు చేసిన వాళ్లు ఐఏఎస్ అధికారులైనా, రాజకీయ నాయకులైనా కఠినంగా శిక్షించాల్సిందేనని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. సీబీఐ పక్షపాతంతో వ్యవహరిస్తోందన్న వాదనతో ఏకీభవించబోనని, బలమైన సాక్ష్యాధారాలు సేకరించి, పకడ్బందీగా కేసులు రూపొందించేందుకే మొదట అధికారులను ప్రశ్నిస్తున్నట్లు భావిస్తున్నానని తెలిపారు. గుంటూరులో 'ఈనాడు-ఈటీవీ'కి ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రిని, ప్రధాన కార్యదర్శిని కలిసి సీబీఐ విచారణ తీరుపై ఫిర్యాదులు చేయడం తదితర పరిణామాలపై స్పందించారు. వివరాలు జేపీ మాటల్లోనే...***

## అలాగైతే వ్యవస్థే కుళ్లిపోతుంది

ప్రభుత్వంలో తీసుకునే నిర్ణయాలకు తుది బాధ్యత నాయకులదే. చట్టాలు చేసేది, విధానాలు నిర్ణయించేది వాళ్లే. అలాగే పరిపాలనలో కీలకమైన పాత్ర ఐఏఎస్ అధికారులదే. ఐఏఎస్‌లకు జవాబుదారీతనం, బాధ్యత అవసరం లేదంటే వ్యవస్థే కుళ్లిపోతుంది. మరే దేశంలోనూ లేని విధంగా ఇక్కడ ఐఏఎస్‌లకు పూర్తిస్థాయి రక్షణ కల్పించారు. నిర్భయంగా పనిచేయడానికి, నిస్సంకోచంగా మనసులో మాట చెప్పడానికి, నాయకులు చెప్పేది తప్పయితే వ్యతిరేకించడానికి అవకాశమిచ్చారు. ఐఏఎస్‌లు తమకు బాధ్యత లేదనడానికి వీల్లేదు. కాకపోతే నిజాయతీపరులను, అవినీతిపరులను వేరుగా చూడాలి. గుర్రాన్నీ, గాడిదనీ ఒకేలా చూస్తే సమాజమే నష్టపోతుంది.

## ఇక్కడున్నంత అవినీతి ఎక్కడా లేదు

ఐఏఎస్ లక్ష్యంగా సీబీఐ విచారణ జరుగుతోందన్న వాదనతో నేను ఏకీభవించను. దేశంలో చాలా చోట్ల నాయకుల్నీ పట్టుకున్నారు. కొందరు మంత్రులనీ జైళ్లలో పెట్టారు. దేశంలో ఎక్కడా జరగని రీతిలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున రాజకీయ అవినీతి జరిగింది. రాజకీయ నాయకులను వదిలిపెట్టి, కేవలం అధికారులనే పట్టుకుంటే పొరపాటవుతుంది. ఆ పనిచేస్తారని నేను అనుకోను. బహుశా ముందు కొందరు అధికారులను పట్టుకుని, గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తే వివరాలు తెలుస్తాయని, అప్పుడు బలమైన కేసులు పెట్టవచ్చునని అనుకుని ఉంటారు. అవినీతికి పాల్పడిన, అన్యాయం జరుగుతోందని తెలిసీ మౌనంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం వ్యవహారానికి ప్రధాన సూత్రధారులైన నాయకులకూ కఠిన శిక్షలు పడాలి.

## చరిత్ర చూడాలి....

నాయకుల్లో, ఐఏఎస్‌ల్లోనూ నిజాయతీపరులున్నారు. అవినీతిపరులూ ఉన్నారు. అవినీతిపరులైన, పై వాళ్లంటే రాజుని మించిన రాజభక్తిని చూపెట్టిన కొందరు అధికారులు ఈ రాష్ట్రాన్ని దారుణంగా దోచుకోవడంలో సహకరించిన మాట, లాలూచీ పడ్డ మాట వాస్తవం. అదే సమయంలో నిజాయతీగా ఉండి,

మంచిగా పరిపాలనచేసినవాళ్లు ఉన్న మాటా వాస్తవం. కాబట్టి ఎవరు తప్పు చేశారో నిర్ణయించేందుకు సాక్ష్యాలు చూడాలి. సాక్ష్యాలు నిర్దుష్టంగా లేనప్పుడు చరిత్ర చూడాలి. ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడు అవినీతిపరుడో మనందరికీ తెలుసు. అధికారుల తీసుకున్న పరిపాలనాపరమైన నిర్ణయాల్లో ఏ దురుద్దేశం లేకుండా, అవినీతి లేకుండా కొన్ని పొరపాట్లు దొర్లితే దాన్ని పెద్దగా పట్టించుకోకూడదు. దాన్ని నేరంగా భావించకుండా అవసరమైతే శాఖాపరమైన విచారణ జరపాలి. అలా కాకుండా అధికారులు కూడా లాలూచీ పడిన, దేశాన్ని దోచుకున్న, ఖజానాకు నష్టం కలిగించిన, పక్షపాతంతో వ్యవహరించిన సందర్భాల్లో కచ్చితంగా శిక్షలు వేయాలి. అప్పుడు అధికారా, నాయకుడా అన్న విషయంలో తేడా ఉండకూడదు.

## సీబీఐకి ఆ తేడాలుండవు

ఎమ్మార్ వ్యవహారంలో కేవలం అధికారుల పాత్రే ఉందంటే పూర్తి అబద్ధమవుతుంది. దీనితో ప్రమేయం లేని, మంచి చరిత్ర ఉన్న అధికారుల పేర్లు కొన్ని అభియోగపత్రంలో పెట్టారంటున్నారు. దాన్ని ప్రభుత్వం, సీబీఐ లోతుగా పరిశీలించాలి. అమాయకులను, నిజాయతీపరులను ఒకరిద్దరిని ఇబ్బంది పెట్టినా ఆ తర్వాత అవినీతిపరులను శిక్షించడం కష్టమవుతుంది. కేవలం అధికారులనే అరెస్టు చేస్తున్నారన్న వాదననూ సమర్థించలేం. గనుల లీజుల విషయంలో చాలా మంది నాయకుల్నీ అరెస్టు చేశారు. సీబీఐకి అధికారులా, నాయకులా అన్న తేడాలుంటాయని నేననుకోను. సాక్ష్యాలు సేకరించాక రాజకీయ నాయకుల వెంటపడాలి. తప్పు చేసిన వాళ్లను జైలుకి పంపాలి. వారి ఆస్తులూ జప్తు చేయాలి.

## ప్రక్షాళనకు కఠిన చర్యలు తప్పవు

దేశంలో అత్యున్నతమైన నేర పరిశోధన సంస్థ సీబీఐ. దాన్ని నమ్మకపోతే అమెరికానో, బ్రిటన్‌లో నమ్ముతారా? పొరపాట్లు ఉంటే సవరించుకోవాలే తప్ప మొత్తం వ్యవస్థనే తప్పు పట్టకూడదు. ఇప్పుడు కేవలం కొంత మందికి ఇబ్బంది కలిగితే దాన్ని సూత్రీకరించి పారేసి ప్రపంచం మొత్తానికి అన్యాయం జరిగిపోతోందని వాపోతున్నారు. అది మంచి పద్ధతి కాదు. దేశంలో భయంకరమైన అవినీతి ఉన్న మాట వాస్తవం. దేశంలో తెగబడి దోచుకున్న మాట వాస్తవం. రాష్ట్రంలో పదుల వేల కోట్ల ప్రజాధనం స్వాహా చేశారు. ప్రజల ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల పరమయ్యాయి. అధికారులు ప్రజల్ని లంచాల కోసం వేధించడం వాస్తవం. అందరూ శాకాహారాలే. కానీ గంపలో రొయ్యలు మాయమైపోయాయి అంటే ఎలా? ఇంత అవినీతే ఎవరికీ బాధ్యత లేకపోతే ఎలా? ఎవరికి వాళ్లే తమ పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, అన్యాయం జరిగిపోతోందనీ అంటే అర్థమేంటి? మీకు అన్యాయం చేస్తోంది సామాన్య ప్రజలా? మన సొంత సమస్యని సమాజం సమస్యగా చిత్రీకరించకూడదు. లంచం ఇవ్వకపోతే, పదిసార్లు తిరగకపోతే ప్రజలకు పనులు కావడం లేదు. దానికి బాధ్యత ఎవరు తీసకుంటారు? వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి కఠినమైన చర్యలు తప్పవు. ఎవరి విషయంలోనైనా పొరపాట్లు జరిగితే సవరిద్దాం. కానీ మాపై ఏ చర్యా వద్దు, దేశాన్ని దోచుకుంటాం, అహంకారంతో విర్రవీగుతాం అంటే కుదరదు. ప్రజాస్వామ్యం అంటే జనం పరిపాలించాలా? గద్దెపై కూర్చున్నవాళ్లు గద్దల్లాగా, కాకుల్లాగా తినిపారేయాలా? ఎంతకాలం ప్రజలు మౌనంగా కూర్చుంటారు. అవినీతి భయంకరంగా కొనసాగుతోంది. దాన్ని అంతం చేయడానికి సమయం అసన్నమైంది.

## అలాంటి చర్యల్ని ఎవరూ క్షమించరు

దేశంలో ఎవరికైనా స్వేచ్ఛ ఉంది. శాంతియుతంగా కలిసి బాధలు చెప్పుకొనే అవకాశం ఉంది. ఐఏఎస్‌లు ముఖ్యమంత్రిని కలవడం ధర్మం. బాధలు ఉంటే సీఎంకి, ప్రధాన కార్యదర్శికే చెప్పాలి. ముఖ్యమంత్రి పరిశీలించి ప్రజాసంక్షేమం దృష్ట్యా నిర్ణయం తీసుకోవాలి. సీఎం హామీ ఇచ్చారు కాబట్టి, అధికారులు దాన్ని అంతటితో వదిలేయాలి. రచ్చ చేయకూడదు. ఆందోళన చేస్తాం, సెలవులు పెడతామంటే అర్థం లేదు. ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రులు సామూహిక సెలవులు, సమ్మెలు చేస్తామంటే ఎలా? ప్రధాని సెలవు పెండతానంటే ఎలా ఉంటుంది. అలాంటి చర్యల్ని ఎవరూ క్షమించరు. ఒక మాజీ అధికారిగా నేను వాటిని సమర్థించను. బాధ్యతలో ఉన్నవారు బాధ్యతగా ప్రవర్తించాలి. బాధ్యత తీసుకోకుండా... చిన్న నొప్పి కలిగితేనే ఇంత విలవిల్లాడితే ఎలా? నొప్పికి మందేదో ఆలోచిద్దాం. అన్యాయంగా ఆరోపణలు చేస్తే పరిష్కారం ఆలోచిద్దాం. అంతే తప్ప సామూహిక సెలవులు పెడతాం. బ్లాక్‌మెయిల్ చేస్తాం అంటే అది సరికాదు. ◆

# ఆసియా దేశాల పరీక్షలో భారత్ బ్యూరోక్రసీ ఫ్లాప్

12 ఆసియా దేశాలలో ప్రభుత్వ ఉన్నతోద్యోగ బృందాల పనితీరుని హాంగ్‌కాంగ్‌లోని పొలిటికల్ అండ్ ఎకనామిక్ రిస్క్ కన్సల్టెన్సీ సంస్థ అంచనా వేసి రాంకింగులు ఇచ్చింది. 1300 మంది వాణిజ్య సంస్థల కార్యనిర్వాకులను సర్వే చేసి ఈ నిర్ధారణకు వచ్చింది.

అత్యంత జడత్వమూ అవినీతి కలిగిన బ్యూరోక్రసీకి 10 మార్కులు ప్రమాణంగా తీసుకుని వివిధ దేశాలకు ర్యాంకులు ఇచ్చారు. ఇందులో భారతీయ బ్యూరోక్రసీ 9.41 పాయింట్లతో అట్టడుగుస్థానంలో వుంది. సింగపూర్ 2.25 అతితక్కువ పాయింట్లతో ఉత్తమ శ్రేణి బ్యూరోక్రసీగా స్థానాన్ని పొందింది. తర్వాత హంగ్‌కాంగ్ 3.53 పాయింట్లతో 5.25 పాయింట్లతో తైవాన్ 5.57 పాయింట్లతో జపాన్ 5.77 పాయింట్లతో దక్షిణకొరియా 5.87 పాయింట్లతో మలేషియా 5.89 పాయింట్లతో మెరుగైన స్థితిలో వున్నాయి.

కాగా చైనా 7.11 పాయింట్లతో, ఫిలిప్పీన్స్ 7.57 పాయింట్లతో ఇండోనేషియా 8.37 పాయింట్లతో వియత్నాం 8.54 పాయింట్లతో సరిపెట్టుకున్నాయి. సర్వే చేసిన వారితో అత్యధికులు భారతీయ బ్యూరోక్రసీని అసమర్థమైందిగా పేర్కొన్నారని ఆ రిపోర్టులో వెల్లడించారు. బ్యూరోక్రసీలో అవినీతి బాగా విస్తరించిందనీ, బల్లకింద ముడుపులను అంగీకరించేవారుగా వున్నారని, బ్యూరోక్రసీ జడత్వాన్ని అధిగమించడానికి కంపెనీలు వారికి ముడుపులు చెల్లించక తప్పడంలేదని తెలియజేశారు. వీరి ద్వారా ప్రభుత్వ సానుకూలతని కంపెనీలు పొందుతున్నాయని వెల్లడించారు.

ఇక్కడ తప్పుడు నిర్ణయాలు చేసి ఉద్యోగులను బాధ్యుల్ని చెయ్యడం అరుదుగానే వుందని, వీరిని విభేదిస్తే దానిని సవాలు చేయడం అత్యంత కష్టతరమని ఈ పోర్టు పేర్కొంది. ఈ పరిస్థితి బ్యూరోక్రాట్లకు మితిమీరిన అధికారాలను సంక్రమింప జేసిందని అందువల్లనే దేశం లోపల, బయట నుండి పెట్టుబడులు పెట్టేవారు భారత బ్యూరోక్రసీని నెగిటివ్ దృక్పథం కలదిగా భావిస్తున్నారని వెల్లడించింది.

ఇలా జడత్వంతో అవినీతితో వున్న బ్యూరోక్రసీ వల్ల భారతదేశం ఆసియాలో తనకు ప్రధాన పోటీదారుగా వున్న చైనా వృద్ధిరేటుతో సరితూగలేకపోతున్నదని ఆ రిపోర్టు స్పష్టం చేసింది.

# అమర్త్యసేన్‌కు హ్యూమానిటీస్ పురస్కారం ప్రదానం



భారత మేధావి, ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌ను అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రతిష్టాత్మక పురస్కారంతో సత్కరించారు. శ్వేతసౌధంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సేన్‌కు నేషనల్ మెడల్స్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ హ్యు మానిటీస్ పురస్కారాన్ని ఒబామా ప్రదానం చేశారు. "పేదరికం, క్షామం అసమానతలకు కారణాలను విశ్లేషించినందుకు ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రధానం చేస్తున్నాం. జీవన ప్రమాణాలను ఎలా లెక్కగట్టాలి అన్న అవగాహనను పెంచారు." అని ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. మరికొందరు ప్రముఖులకు కూడా ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఒబామా, సేన్‌లిద్దరూ ముచ్చటించుకుంటూ కనిపించారు.

# ప్రాథమిక పాఠశాలగా మారిన ఐ.ఎ.యస్. అధికారి అవినీతి మేడ

అది బీహారులో పాట్నా నగరంలో ఒక పెద్ద మేడ. ప్రస్తుతం అది పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలగా మారింది. ఇదొక అవినీతి మేడ. ఒక ఐ.ఎ.యస్. అధికారి భవనం. ఆయన పేరు శివశంకర్ వర్మ. 1981 బ్యాచ్‌కి చెందిన ఐ.ఎ.యస్. అధికారి. అవినీతిలో ఇరుక్కున్న ఈ అధికారిని బీహారు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన ఆస్తుల్ని జప్తు చేసింది. ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ ఈ భవనాన్ని ప్రాథమిక పాఠశాలగా మారుస్తానని ప్రకటించడమే కాదు అన్న మాటలను నిలబెట్టుకున్నారు.

పాట్నాలో రుకాన్‌పురా ప్రాంతంలో ఒక ప్రభుత్వ పాఠశాల వుంది. అది శిథిలావస్థలో వుంది. అక్కడ చదువుకునే పిల్లలంతా పేదలే. కంపుకొట్టే పరిసరాల మధ్య వున్న ఈ పాఠశాల వర్షాకాలంలో కురుస్తుంది. వరండాలోనే పిల్లల చదువులు సాగుతాయి. అక్కడే వంట. మధ్యాహ్న భోజనం సాగుతున్నాయి. ఈ స్కూలుకి బాత్‌రూంలు, టాయిలెట్లు లేవు – కరెంట్ లేదు ఇక ఫ్యానులు సరేసరి.

ఈ పిల్లలందరినీ ఒక రోజు ఈ అవినీతిమేడకు తరలించారు. పిల్లలు అది ఎక్స్‌కర్షన్ అనుకున్నారు. గదులన్నీ తిరిగి చూశారు. అంతా పాల రాతిమయం కాంతులీనే టైల్స్ – ప్రతి గదికీ బాత్‌రూం. అన్నింటా ఫ్యాన్లు రేపటి నుండి ఇదే మీ బడి అంటే పిల్లలు ఆశ్చర్యపోయారు. నిజంగానే అది పాఠశాలగా మారింది. ఫ్యాను కింద కూర్చోవడం ఇదే మొదటిసారి అంటున్నారు పిల్లలు. వంటగది ఎంతో పరిశుభ్రంగా వుందంటున్నారు మధ్యాహ్నభోజనం పెట్టేవారు.

మొత్తానికి అవినీతి పరుల భరతం పట్టడంలో ఆస్తుల జప్తు ఒక ముందడుగు. దానిని ప్రభుత్వ సొత్తు చెయ్యడం ప్రజా అవసరాలకు వినియోగించడం అందరికీ కనువిప్పు కావాలి. అవినీతిరహిత పాలన అందించడానికి ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ చేబడుతున్న చర్యలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ధృఢమైన రాజకీయ సంకల్పం వున్న వారికి ప్రజలు ఓట్లు వేసి పగ్గాలు అప్పగిస్తే మార్పునీ, ప్రగతినీ మన కళ్లెదుటే చూడగలం అనడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ◆



# మద్యం సిండికేట్లలో కాంగ్రెస్, తె.దే నేతల హవా

## స్వర్ణాంధ్ర + హరితాంధ్ర = మద్యాంధ్రప్రదేశ్

**అధికారానికి సిగపట్లు**
**మద్యం మత్తులో జతకట్టు**
**ఇదే సిండికేట్ల లోగుట్టు**

మద్యం సిండికేట్ల పుట్ట బద్దలైంది. దీనిని ఆశ్రయించుకుని అందదండలతో లబ్ధిపొందుతున్న వివిధ పార్టీ నేతలు, కొందరు పాత్రికేయుల, ఎందరో ఎక్సైజ్ అధికారులు ఒక్కొక్కరుగా వెలుగుచూస్తున్నారు. సాక్షాత్తూ ఎక్సైజ్‌శాఖ మంత్రి ఆరోపణకు గురయ్యారు.

ఇదంతా తమ ప్రభుత్వం అవినీతిక్షాళనకు చేస్తున్న ప్రయత్నంగా చూపెట్టడానికి ముఖ్యమంత్రి అనుయాయులు ప్రయత్నిస్తున్నారు. మరొకపక్క ముఖ్యమంత్రి తన స్థానాన్ని పదిలం చేసుకోవడానికి సాగిస్తున్న అంతర్గత కుమ్ములాటగా చూపించి తాను తప్పించుకోవాలని తెలుగుదేశం నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. నైతికతను పక్కనపెట్టి చూస్తే కేవలం వామపక్షాలు మాత్రమే సిండికేట్ల సొమ్ము తమ పార్టీలకు విరాళాలుగా ముట్టాయని చెప్పగల నిజాయితీని ప్రదర్శించాయి. దీంతో మంత్రిమీద, ఇతర శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పాత్రికేయుల మీద, అధికారగణం మీద ముడుపుల చెల్లింపుల ఆరోపణలు నిజమేనన్న అభిప్రాయానికి వారు వీలు కల్పించారు. ఈ మద్యం సిండికేట్ల దందా బైటపడిన కొన్ని ప్రాంతాలకే కొందరికే ఇది పరిమితమైందికాదు. వీరు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ నియోజక వర్గాలన్నింటా ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. ఒక్కొక్క ప్రాంతంలోనే కొన్ని లక్షల ముడుపులు కనిపిస్తున్న అక్రమం రాష్ట్రం మొత్తం మీద కలిపితే అది కోట్లకు పడగలెత్తుంది. 70శాతం పేద కుటుంబాలను కొల్లగొట్టి, వారి కుటుంబ జీవనాన్ని నాశనం చేసి, వాళ్ళను అర్ధాయుష్కుల్ని చేసి అనునిత్యం సాగిస్తున్న దోపిడీకి ఇది నిదర్శనం. అందుచేత ఎవరికి వారు తప్పించుకునే ఎత్తుగడలకు స్వస్తి చెప్పి మద్యం మహమ్మారి నుండి రాష్ట్రాన్ని విముక్తం చెయ్యడానికి అందరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఇది.

ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో మద్యం ఒక కీలక అంశంగా మారింది. ఈ పరిణామానికి దశాబ్దంపైబడిన చరిత్ర వుంది. 1997లో చంద్రబాబు హయాంలో మద్యనిషేధాన్ని తొలగించారు. ఇది కేవలం సడలింపు మాత్రమేనని, సారా, గుడుంబాలకు పేదల్ని దూరం చెయ్యడానికి ఉద్దేశించబడిందని, వచ్చే ఆదాయం పేదల సంక్షేమం కోసమేనని ఆయన హామీలిచ్చారు. కాని రెండేళ్ళు తిరక్కుండానే మద్యంషాపుల వేలం పాటల జోరు అందుకుంది. పోటీపడి తెదేపా, కాంగ్రెస్ అనుయాయులు వాటిని దక్కించుకున్నారు. ఈ పార్టీనేతలే వాటిని సిండికేట్లుగా ఏర్పాటుకు దోహదం చేశారు. బెల్టుషాపులకి ద్వారాలు తెరిచారు. ఈ వ్యాపారంలో లబ్ధి ఆ పార్టీ అనుయాయులే పొందారు. నేతలకు వాటాలు పెట్టారు. చాలా చోట్ల నేతలే బినామీలుగా వున్నారు.

ఆనాడు ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్‌నేతలు చంద్రబాబు మద్యం విధానాన్ని తూర్పారబట్టారు. తాము అధికారంలోకి వస్తే దశలవారీగా మద్య నిషేధానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కాని అధికారంలోకి వచ్చాక ఇదే దొంగాట గత 7,8 సంవత్సరాలుగా కాంగ్రెస్ చేస్తున్నది. ఆనాడు కాంగ్రెస్ పోషించిన ప్రతిపక్షపాత్రనే ఈనాడు తెదేపానేతలు పాటిస్తున్నారు. వేలం పాటలలో పోటీపడుతున్నారు. పాటల అనంతరం సిండికేట్లుగా కుమ్మక్కవుతున్నారు. మద్యాన్ని మరింత విచ్చలవిడిగా పారిస్తున్నారు. తోచిన రేట్లకి అమ్ముకుంటూ ఆ సొమ్మును 'తిలాపాపం తలాపిడికెడు' గా పంచిపెడుతున్నారు.

రాష్ట్రంలో మద్యంవ్యాపారం చుట్టూ ఈ రెండు పార్టీలు అల్లుకుని వున్నాయి. నిత్యరాజకీయంలో పోట్లగిత్తల్లా రంకెలేస్తూ పోరాడుతున్నారు. మద్యం సిండికేట్లు దగ్గర అంతా ఒక్కటిగానే వ్యవహరిస్తున్నారు. ఇలా ఈ ఉభయులు ప్రభుత్వంలో వున్నా,



బెల్టుషాపులు లేవు..... చూపిస్తే మూయిస్తాం...
నాటి ముఖ్యమంత్రి బుకాయింపు

**బెల్టుషాపులు చల్లి**
**కళ్లు మూసిన పిల్లి**
**బుకాయింపుల లొల్లి**
**ఓ కూనలమ్మ**



Cartoon by Sridhar, published in *Eenadu*.

The (then) Chief Minister, Chandra Babu Naidu, is telling the woman, 'Don't cry! I am forced to do this for your welfare and your children's future! I doing it with sorrow!'

మేమూ బెల్టు తీస్తాం... చంద్రబాబు ప్రగల్భాలు...

**బెల్టు తీసేముందు**
**కార్టూన్ చూడమందు**
**తె.దే నోరిక బందు**
**ఓ కూనలమ్మ**

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత పదేళ్ళలో పెరిగిన మద్యం అమ్మకాలు జిల్లాల వారీగా ( కోట్ల రూపాయలలో)

| జిల్లాలు | 2000-01 | 01-02 | 02-03 | 03-04 | 04-05 | 05-06 | 06-07 | 07-08* | 08-09 | 09-10 | Upto Nov 11 | Growth Rate in % |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 304 | 345 | 398 | 444 | 514 | 592 | 694 | 900 | 1117 | 1288 | 997 | 14 |
| రంగారెడ్డి | 208 | 247 | 299 | 348 | 419 | 538 | 812 | 1000 | 1239 | 1438 | 1085 | 20 |
| అదిలాబాద్ | 72 | 82 | 106 | 116 | 134 | 145 | 181 | 201 | 301 | 377 | 268 | 15 |
| నిజామాబాద్ | 65 | 69 | 80 | 85 | 93 | 113 | 156 | 206 | 253 | 296 | 219 | 14 |
| మెదక్ | 66 | 75 | 83 | 88 | 103 | 130 | 214 | 295 | 374 | 437 | 304 | 19 |
| నల్గొండ | 122 | 131 | 150 | 143 | 175 | 220 | 306 | 392 | 479 | 549 | 409 | 15 |
| మహబూబ్‌నగర్ | 77 | 80 | 98 | 107 | 130 | 163 | 252 | 326 | 394 | 483 | 338 | 18 |
| వరంగల్ | 138 | 148 | 163 | 178 | 108 | 235 | 282 | 412 | 538 | 598 | 442 | 15 |
| కరీంనగర్ | 156 | 169 | 200 | 214 | 243 | 273 | 335 | 474 | 610 | 708 | 520 | 15 |
| ఖమ్మం | 79 | 80 | 88 | 94 | 115 | 126 | 153 | 186 | 219 | 332 | 243 | 14 |
| కర్నూలు | 68 | 77 | 91 | 98 | 117 | 138 | 167 | 246 | 329 | 438 | 328 | 17 |
| చిత్తూరు | 138 | 156 | 167 | 179 | 204 | 242 | 300 | 421 | 543 | 619 | 463 | 15 |
| అనంతపురం | 82 | 88 | 99 | 106 | 118 | 134 | 161 | 264 | 363 | 391 | 291 | 16 |
| కడప | 83 | 94 | 109 | 118 | 142 | 167 | 199 | 569 | 318 | 421 | 309 | 16 |
| నెల్లూరు | 123 | 137 | 162 | 171 | 193 | 221 | 261 | 375 | 508 | 567 | 419 | 15 |
| ప్రకాశం | 90 | 98 | 111 | 104 | 130 | 158 | 291 | 342 | 390 | 432 | 328 | 16 |
| గుంటూరు | 180 | 187 | 206 | 197 | 239 | 271 | 322 | 482 | 638 | 705 | 521 | 13 |
| విజయవాడ | 195 | 200 | 212 | 204 | 233 | 269 | 324 | 463 | 602 | 655 | 489 | 12 |
| పశ్చిమగోదావరి | 162 | 176 | 191 | 186 | 217 | 259 | 296 | 407 | 513 | 554 | 390 | 12 |
| తూర్పుగోదావరి | 176 | 191 | 228 | 218 | 241 | 297 | 336 | 465 | 581 | 650 | 512 | 13 |
| విశాఖపట్నం | 214 | 129 | 248 | 242 | 278 | 359 | 429 | 472 | 517 | 784 | 569 | 13 |
| విజయనగరం | 63 | 71 | 86 | 93 | 119 | 155 | 185 | 245 | 316 | 345 | 260 | 17 |
| శ్రీకాకుళం | 66 | 75 | 90 | 102 | 121 | 144 | 171 | 243 | 296 | 322 | 241 | 16 |
| మొత్తం | **2936** | **3207** | **3677** | **3843** | **4497** | **5363** | **6740** | **9200** | **11771** | **13402** | **9957** | **15%** |

ప్రతిపక్షంలో వున్నా మద్యం వ్యాపారంలో మాత్రం కలిసే వుంటున్నారు. ఈ రాష్ట్రాన్ని ఒకరు స్వర్ణాంధ్రపదేశ్‌గా మారుస్తామని ప్రగల్భాలు పలికారు. మరొకరు హరితాంధ్రప్రదేశ్‌ను చేస్తామని గప్పాలు కొట్టారు. ఇరు పార్టీల నేతలూ కలిసి సాధించింది మాత్రం మనం అనుభవిస్తున్న మద్యాంధ్రప్రదేశ్‌ని.

తెదేపా హయాంలో మద్యం మీద ఇంత ఆదాయం లేదని, ఇంత విచ్చలవిడితనం లేదని కొందరు వాదిస్తుంటే ఇప్పుడు జనాభా పెరిగిందని, రేట్లు పెరిగాయని, ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని ఎదురు వాదనలు మరికొందరు చేస్తున్నారు. ఇలా ఎక్కువ తక్కువ వాదనలు పక్కనపెడితే ఈ పార్టీనేతలే మద్యాన్ని మహమ్మారిగా మార్చారని పేదల జీవితాలతో ఆటలాడుకుంటూ వారిని పీల్చి పిప్పి చేస్తున్నారనేది వాస్తవం.

కారణాలు ఏవైనా ముఖ్యమంత్రి ప్రత్యక్షంగానో పరోక్షంగానే సిండికేట్ల గుట్టురట్టు చేయించారు. అందుకు ఆయనను అభినందించాలి. పోతే కేవలం పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని పదిలపర్చుకోడానికి మాత్రమే దీనిని వినియోగించుకుంటే ప్రజలు క్షమించరు. అందుచేత రాష్ట్రంలో ఈ మద్యం మహమ్మారిని కఠినంగా నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఆయన నిజాయితీని శంకించక తప్పదు.

ముందుగా ఆరోపణలు వచ్చిన ఎక్సైజ్ శాఖామంత్రిని తొలగించాలి. విచారణ అనంతరం నిర్దోషిగా తేలితే మళ్లీ మంత్రిపదవిని కట్టబెట్టినా ఎవరూ తప్పుపట్టరు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారగణం మీద కఠినచర్యలు తీసుకోవాలి. సిండికేట్లుగా మారి నిర్వహిస్తున్న బెల్టుషాపుల్ని మూయించడం, సిట్టింగ్ రూములు, లూజు అమ్మకాలు, అధిక ధరలకు అమ్మకాలను తక్షణమే అరికట్టాలి.

వచ్చే జూన్ నుండి కొత్త ఎక్సైజ్ విధానాన్ని ముఖ్యమంత్రి ప్రకటించాలి. వేలం పద్ధతిని రద్దుచేసి ప్రభుత్వమే పరిమితంగా షాపులు నిర్వహించి పరిమిత వేళల్లో అమ్మకాలను చేపట్టడం మద్యరహిత గ్రామాలకు నజరానాలు ప్రకటించడం, సారా గుడుంబాలను ఉక్కుపాదంతో అణిచివేతకు చర్యల్ని ప్రకటించాలి.

ఈ చర్యల వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు 7,8 వేలకోట్లు ఆదాయం తగ్గుతుంది. ఈ తగ్గుదల రాబోయే బడ్జెట్‌తో సూచన ప్రాయంగా ప్రకటించాలి. ఇలాంటి నిబద్ధతను ముఖ్యమంత్రి ప్రదర్శించకపోతే ఆయన స్వంత ఎజెండాతోనే ఈ సిండికేట్ల

## మద్యం సిండికేట్ల నుండి ఎవరెవరికి ఎంత!

- ఎక్సైజ్‌శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణకి చంద్రావైన్స్ యజమాని బాబ్జీ, మంత్రి క్లాస్‌మేట్ రాజాబాబు అలియాస్ రాజాతో కలిసి మంత్రి క్వార్టర్లలోనే రూ॥10లక్షలు అందజేత.
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు (తెదేపా) మూడు నెలల కిందట రూ॥3లక్షలు.
- మహబూబాబాద్ ఎమ్మెల్యే ఎం.కవితకు (కాంగ్రెస్) ఏడాది కిందట రూ॥5 లక్షలు.
- మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావుకు (సీపీఐ) 29 దుకాణాల నుంచి నెలకు రూ॥10 వేల చొప్పున ఏడాదికి రూ॥3 లక్షలు.
- సీపీఎం జిల్లా కార్యదర్శి సుదర్శన్‌కు మహాసభల కోసం రూ॥3 లక్షలు.
- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోటు రంగారావుకు 29 దుకాణాల నుంచి రూ॥15వేల చొప్పున ఏడాదికి రూ॥4.50 లక్షలు.
- తెరాస జిల్లా కార్యదర్శి రాజేందర్‌కు రూ॥60వేలు.
- మహబూబాబాద్ సీపీఐ నేత విజయసారధికి రూ॥40వేలు.
- సీపీఎం పార్టీ నేత ఎస్.శ్రీనివాస్‌కు రూ॥40వేలు.

**పాత్రికేయులు...**

- సమ్మిరెడ్డికి 2010-11లో రూ॥40వేలు. - శ్రీనివాసరెడ్డికి ఏడాదికి రూ॥50వేలు. - మధుకి ఏడాదికి రూ॥80వేలు.
- దండి భాస్కర్‌కు ఏడాదికి రూ॥50వేలు. - మరొకరికి 2011లో రూ॥40వేలు.

## మరికొన్ని వార్తలు

- కర్నూలు జిల్లాలో 4 సిండికేట్లు
- ప్రతినెల చెల్లిస్తున్న మామూళ్లు 22 లక్షలు
- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి 6 నెలలకి 4 లక్షలు
- శ్రీకాకుళం జిల్లాలో మంత్రి ధర్మాన ప్రసాదరావు మేనల్లుడు చిన్నాల వెంకట్, మంత్రి ప్రైవేటు సెక్రెటరీ తదితరులకు 39 లక్షలు చెల్లించినట్లు, ఐతే ఇందులో 20 లక్షలు పెట్టుబడిగా పెట్టారని దాన్ని పుస్తకాల్లో రాయలేదని సిండికేట్ నేత ఓరుగంటి ఈశ్వరరావు సిబిఐకి తెలిపారు.



మద్యం పై లోక్‌సత్తా గతంలో నిర్వహించిన ప్రచార ఉద్యమచిత్రం

తుట్టెను కదిలించినట్లు భావించవలసి వస్తుంది.

అలాగే ప్రతిపక్ష నేతగా వున్న చంద్రబాబు ఈ మద్యం సిండికేట్లలో సభ్యులుగా, బినామీలుగా వున్న నేతలను కట్టడి చేసే చర్యలు ప్రకటించాలి. సిండికేట్లనుండి బైటకు రాని వారిని, బెల్టుషాపులు నిర్వహించే వారిని అధికధరలకు అమ్మేవారిని, వాటి నుండి లబ్ధి పొందే వారిని పార్టీ నుండి దూరం చెయ్యడానికి తీవ్రమైన చర్యల్ని ప్రకటించాలి. రాజకీయంగా పోటీపడుతూ మద్యం వ్యాపారంలో లాలూచీకి ఆ పార్టీ స్వస్తి పలకాలి. తమ పార్టీ తరపున ఎన్నికయ్యే పంచాయితీ సర్పంచ్‌తో ఆ గ్రామాలలో మద్యం అమ్మకాలను నిషేధిస్తామని ప్రకటించాలి.

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం పంపిణీకి తమ పార్టీ దూరంగా వుంటుందని ప్రకటించాలి. ముడుపులు పొందిన నేతల మీద చర్యలు తీసుకోరు. ఇవేమీ చెయ్యకుండా అడపా దడపా ధర్నాలు నిర్వహిస్తు మహిళల్ని ఆకట్టుకోవాలనుకుంటే అది ఆత్మవంచన, పరవంచన అవుతుంది.

వామ పక్షాలు, విప్లవపార్టీలు ఈ సిండికేట్ల విరాళాలలో చిక్కుకోవడం దురదృష్టకరం. ఈ సొమ్ము పార్టీలకి విరాళాలుగా తీసుకున్నామని వాటికి జమాఖర్చులున్నాయని వారు సమర్థించుకుంటున్నారు. పార్టీల నిర్వహణకు విరాళాలు అవసరాన్ని ఎవరూ కాదనరు. విరాళాలు ఇచ్చే వారికి, పుచ్చుకునే వారికి వర్తించే చట్టం వున్నది. దాని పరిధిలో ఏ పార్టీ విరాళాలు సేకరించినా ఎవరూ తప్పుపట్టరు. ఒక మద్యంషాపుయజమాని ఆ పార్టీలకు విరాళం ఇస్తే దానిని కూడా అర్థం చేసుకోవచ్చు. కాని బెల్టుషాపుల మీద, అధిక ధరలకు మద్యం అమ్మకాల మీద అనునిత్యం ఏదో ఒక ఉద్యమం చేస్తూనే ఈ పార్టీలు దీనికి కారణ భూతంగా వున్న సిండికేట్ల నుండి పెద్ద మొత్తాలు విరాళాలుగా సేకరించడంలో నైతికతను ఎవరైనా ప్రశ్నిస్తారు. వారు సాగించే ఉద్యమాలలో నిబద్ధతనీ ఎవరైనా శంకిస్తారు. ఈ నైతిక బాధ్యత నుండి వారు తప్పించుకోలేరు. ఇది కాంగ్రెస్, తెదేపాలతో పొత్తులతో సంక్రమించిన సాంగత్యదోషంగా పరిగణించాల్సి వస్తుంది.

ఇక మీడియా ప్రతినిధులు కొందరు ఈ మామూళ్ల దందాలో భాగస్వాములు కావడం మరింత దురదృష్టకరం చట్ట విరుద్ధంగా సాగుతున్న బెలుషాపుల నిర్వహణ, సిట్టింగ్ రూములతో పాటు అధిక ధరలు గుంజుతున్న సిండికేట్ల గుట్టు రట్టు చెయ్యాల్సిన వారే ప్రలోభాలకు లోనైతే మీడియా విశ్వసనీయత దెబ్బతింటుంది. ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కొన్ని చోట్ల బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారన్న వార్తలు వస్తున్నాయి. మీడియాను అడ్డం పెట్టుకుని చేసే ఈ లాలూచే అవినీతి తమకు పట్టనట్లు యజమానులు వ్యవహరించడం సబబు కాదు. ఇలాంటి వారిపై నిఘాపెట్టి తగిన చర్యలు తీసుకోకపోతే మీడియా విశ్వసనీయత మరింత దిగజారుతుంది.

ఇలా రాష్ట్రంలో మద్యం చుట్టూ పెనవేసుకుపోయిన విషవలయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్న భయం లేకపోతే పార్టీలు మరీ బరితెగించి వ్యవహరిస్తాయి. దీనిలో కూరుకుపోయిన పార్టీలు, నేతలు ఎదురుదాడులకు స్వస్తి చెప్పి ఆత్మపరిశీలన చేసుకోవాలి. అలాంటి చిత్తశుద్ధిని ఈ పార్టీలు ప్రదర్శిస్తాయని ఆశిద్దాం. ◆

**- సవ్యసాచి**

# మద్యం రిటైల్ వ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రభుత్వ దుర్మార్గపు విధానాలు, అధికారుల అవినీతి, తప్పుడు రాజకీయం... కలిసికట్టుగా ప్రజల జీవితాలతో ఆడుకోవటం వల్లే రాష్ట్రంలో నాటుసారా తాగి ప్రజలు మరణిస్తున్నారని, లక్షలాది పేద కుటుంబాలు చితికి పోతున్నాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కృష్ణా జిల్లా మైలవరం మండలంలో నాటుసారా తాగి పలువురు మరణించిన ఘటన రాష్ట్రం మొత్తానికీ ప్రమాదఘంటిక అని, దీనిపై తాత్కాలికంగా స్పందించటం వల్ల ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవటం వల్ల తాగుడు వ్యసనం ప్రజల జీవితాల్ని పీల్చిపిప్పి చేస్తోందన్నారు. రాష్ట్రప్రభుత్వం మద్యం నుంచి ఏడాదికి ఎక్సైజ్, వ్యాట్, లైసెన్సు ఫీజు తదితరాల ద్వారా సుమారు రూ.18,000-20,000 కోట్లు, రోజుకు రూ.50-60 కోట్లు, గంటకు రూ. 2-3కోట్లు అధికారిక ఆదాయం పొందుతోందని, ఈ లెక్కన ప్రజలు అధికారికంగా గంటకు రూ.4-5కోట్లు మద్యానికి తగలేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలకు ప్రభుత్వం గరిష్టంగా రూ. 20,000 కోట్లు లోపు ఖర్చుచేస్తుంటే, మద్యం ద్వారా ప్రజలు తమ జేబుల్లో నుంచి దాదాపు రూ.40,000-50,000కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇది పేదల్ని మూకుమ్మడి దగా చేస్తూ పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే రాజకీయమన్నారు. జులై 1, 2012 నుంచి ప్రారంభంకాబోయే ఎక్సైజ్ సంవత్సరం నుంచి ప్రభుత్వ మద్యం విధానాన్ని సమూలంగా మార్చాలని జేపీ డిమాండ్ చేశారు.

కృష్ణా జిల్లా మైలవరం మండలంలో జరిగిన కల్తీ సారా మరణాలపై జేపీ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... మైలవరంలో కల్తీసారా వ్యాపారం వెనక రాజకీయ పార్టీల ప్రమేయం ఉందని కృష్ణాజిల్లా లోక్‌సత్తా నేతల నిజనిర్ధారణలో స్పష్టంగా తేలిందని అన్నారు. రాజకీయ నేతలు, స్థానిక ప్రభుత్వ యంత్రాంగం ప్రమేయంతోనే ఈ దారుణం జరిగిందన్నారు. కందిమర్ల వంటి గ్రామాలలో వీరంతా లాలూచీ పడి నాటుసారా వ్యాపారం



మద్య నియంత్రణ కోసం లోక్‌సత్తా గతంలో నిర్వహించిన ప్రచార ఉద్యమచిత్రం

నడిపిస్తున్నారన్నారు. తమ ప్రాంతంలో మద్యానికి వ్యతిరేకంగా ముందుకొచ్చిన యువత, స్థానిక ప్రజల మీద తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ఈవేళ మైలవరం మరణాల పట్ల దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేస్తున్న పార్టీలు కేవలం నటిస్తున్నాయన్నారు. ఆ ఘటనకు మీరు కారణమంటే, కాదు మీరని కాంగ్రెస్, తెలుగుదేశం నేతలు ఒకరిమీద ఒకరు నెపం నెట్టుకుంటూ ఇద్దరూ కలిసి జనాన్ని నాశనం చేస్తున్నారని, ఇకనైనా రెండు పార్టీలూ డ్రామాలు కట్టిపెట్టాలన్నారు. కాపుసారా, నాటు సారా విక్రయాలలో ఆ రెండు పార్టీలకు చెందిన నేతలే 90శాతం వరకూ ఉన్నారనేది మీడియా సాక్షిగా బహిరంగ రహస్యమన్నారు.

మద్యానికి లైసెన్సు విధానం పెట్టి వేలం పాటల్ని నిర్వహించటం వల్ల సామాన్యుల జీవితాలు దారుణంగా దెబ్బతింటున్నాయని జేపీ అన్నారు. సగటున రాష్ట్రంలోని ఒక్కో మద్యం దుకాణానికి రూ.70లక్షలు కేవలం లైసెన్సు ఫీజు ఉందని, అంటే రోజుకు రూ.20,000 చెల్లించాల్సి ఉందన్నారు. గుంటూరు జిల్లా దాచేపల్లి వద్ద ఒక మద్యం దుకాణం వేలం పాటలో రూ.5కోట్ల 18లక్షలు పలికిందన్నారు. అంటే లైసెన్సు ఫీజు చెల్లించేందుకు రోజుకు రూ.1లక్షా 50వేల రూపాయల్ని ఆ దుకాణం ఆర్జించాల్సుందన్నారు. దాని పర్యవసానంగా, ఎలాగైనా మద్యం అమ్మాలని వీధివీధిలో, గ్రామగ్రామంలో మద్యాన్ని ప్రవహింపచేస్తున్నారన్నారు. ఎమ్మార్పీ కంటే అనేకరెట్లు ఎక్కువకు మద్యం అమ్ముతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం (1968)లోని సెక్షన్లు 14, 42,43ఎ, 45, ప్రొహిబిషన్ చట్టంలోని 7ఎ, ఐపీసీ సెక్షన్లు 481-89 అన్నీ కఠినంగా కల్తీ, అక్రమమద్యందారులపై చర్యలకు ఏర్పాట్లు ఉన్నా, ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేకపోవటం, వల్ల పేదప్రజలు బలైపోతున్నారన్నారు. చౌకమద్యం అందుబాటులో లేకపోవటం వల్లే నాటుసారా బారిన సామాన్యప్రజలు పడుతున్నారనే వాదనలో పసలేదని, వేలం పాటలు లేకుంటే సాధారణ రేట్లకే మద్యం అందుబాటులో ఉంటుందన్నారు.

విచ్చలవిడి మద్యంపై లోక్‌సత్తా తొలినుంచీ హెచ్చరిస్తూ వస్తోందని, 2007లో తాము హైకోర్టులో రిట్‌పిటిషన్‌ను దాఖలు చేస్తే ఆ పిటిషన్‌ను అసలు వినాల్సిన అవసరమే లేదని ప్రభుత్వం పనిగట్టుకుని గట్టిగా వాదిస్తోందని జేపీ తీవ్రంగా ధ్వజమెత్తారు. వరంగల్ జిల్లాలోని ఒక్క మండలంలోనే 1500మందికి పైగా యువకులు మద్యం బారిన పడి అకాలమరణం చెందటం, ఆదిలాబాద్ జిల్లాలో క్లోరల్ హైడ్రేట్‌ను బహిరంగంగా విక్రయించటం ఇవన్నీ లోక్‌సత్తా, మహిళాసత్తా బైటపెట్టాయన్నారు.

ఎన్నికల సమయంలో దాదాపు 15రోజుల పాటు ఉచితంగా మద్యం పోయించి యువతకు మద్యాన్ని అలవాటు చేస్తున్నారని, ఆ తర్వాత విచ్చలవిడిగా అందుబాటులో ఉండటం, క్రమంగా వారు అక్రమ, కల్తీ మద్యానికి అలవాటు పడటం జరుగుతోందన్నారు. అన్ని పార్టీలకు చెందిన శాసనసభ్యులలో చాలామంది ఈ అక్రమవ్యాపారంలో ఏదోకరకంగా భాగస్వాములై ఉన్నారని చెబుతున్నారని, ఏసీబీ దాడుల వివరాల్ని బైటపెట్టకుండా ఏదో రక్షణ రహస్యంలాగా దాచి పెడుతున్నారన్నారు. మిలాఖత్ అయినవారే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు.

ఎట్టి పరిస్థితులలోనూ మద్యం విధానాన్ని సమూలంగా మార్చాలని జేపీ డిమాండ్ చేశారు. "మద్యం దుకాణాల సంఖ్యను పరిమితం చేసి, రిటైల్ వ్యాపారాన్ని జాతీయాకరించి ప్రభుత్వమే మద్యం చిల్లర దుకాణాల్ని నిర్వహించాలి. గ్రామంలో మద్యం దుకాణం ఉండాలో, లేదో నిర్ణయించుకునే అధికారాన్ని ఆ గ్రామపంచాయతీకే ఇవ్వాలి. అక్రమ మద్యాన్ని నిరోధించే పూర్తి అధికారాన్ని, దానికి కావలసిన సిబ్బందిని పంచాయతీలకు ఇచ్చి, ఆ బాధ్యతలో విఫలమైతే ఉద్యోగాల నుంచి తొలగించటం సహా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి" అన్నారు. అకస్మాత్తుగా మద్యనిషేధాన్ని విధిస్తే అమలు చేసే పరిస్థితి లేదు కాబట్టి, ప్రజల స్వేచ్ఛను హరించటంకాకుండా పేదల జీవితాల్ని కాపాడటం అవసరం కాబట్టి ఈ విధానాన్ని లోక్‌సత్తా సూచిస్తోందన్నారు.

ఇకనైనా చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలలో మద్యం పంచబోమని కాంగ్రెస్, తెలుగుదేశం ప్రజల ముందు బహిరంగ ప్రమాణం చేయాలని, దీనివల్ల కొంతైనా మద్యం ప్రవాహాన్ని అరికట్టవచ్చన్నారు. మద్యం ఆదాయం తగ్గితే ఆ మేరకు ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వానికి పన్నుల ద్వారా ఆదాయం వస్తుందని, ప్రజలకు ఆరోగ్యం, ఆర్థిక భద్రత లభించి పేదరికం కూడా తొలగిపోతుందని అన్నారు. పేదరికాన్ని తొలగించుకుంటామో, కొనసాగించుకుంటామో తేల్చుకోవాల్సిన సమయమిది అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ◆

# మద్యంపై పోరాడింది లోక్‌సత్తా పార్టీయే




**దూబగుంట నుంచి లోక్‌సత్తా మద్యనియంత్రణ చైతన్యయాత్ర**

**22 వరకూ... 16 జిల్లాలు... శ్రీకాకుళం వరకూ**

**చైతన్యరథానికి జెండా ఊపి ప్రారంభించిన జేపీ**

**-"సాంప్రదాయపార్టీలంటే సా.రా పార్టీలని" ధ్వజం-**

**2010, జూలై 7**




**బెల్టుషాపుల్ని మూయిద్దాం..**

**సారా - గుడుంబాలను తరిమేద్దాం...**

**లోక్‌సత్తా పార్టీ - మహిళాసత్తా, యువసత్తాల విజ్ఞప్తి**

సోదరీ సోదరులారా!

**ఇది మద్యాంధ్రప్రదేశ్** : రాష్ట్రంలో మంచినీళ్ళు దొరకని ప్రాంతాలున్నాయి. పిల్లలకు పాఠశాలలు, ప్రజలకు ఆసుపత్రులు అందుబాటులో లేని గ్రామాలున్నాయి. కాని మద్యం, చీపులిక్కరు, నాటుసారా, గుడుంబాలలో ఏదో ఒకటి దొరకని గ్రామం అంటూలేదు. స్వర్ణాంధ్రప్రదేశ్, హరితాంధ్రప్రదేశ్‌ల మాట ఎలా ఉన్నా రాష్ట్రం ఇప్పుడు మద్యాంధ్రప్రదేశ్ అయ్యింది.

2007 ఆగస్టు 15 నుండి అక్టోబర్ 2 వరకు మద్యంపై జన చైతన్య యాత్ర (కరపత్రం)

పేద, మధ్య తరగతి కుటుంబాల్ని

ఆరోగ్య, ఆర్థిక, సామాజికపరంగా చిదిమేస్తున్న మద్యాన్ని విస్తరించే

**వేలంపాటల్ని ఆపండి**

గవర్నర్, ముఖ్యమంత్రి, ఆరోగ్యమంత్రులకు లోక్‌సత్తా వినతిపత్రాలు





# విదేశాల్లో దాచిన నల్లధనం 24.5 లక్షల కోట్లు

## - సీబీఐ డైరెక్టర్ ఏపీసింగ్




విదేశీ బ్యాంకుల్లో భారీగా అక్రమ సొమ్మును డిపాజిట్ చేసినవారిలో భారతీయులే ముందున్నారని సీబీఐ డైరెక్టర్ ఏపీ సింగ్ చెప్పారు. సుమారు రూ॥24.5 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల) నల్లధనాన్ని భారతీయులు విదేశీ బ్యాంకుల్లో దాచినట్లు అంచనా ఉందన్నారు. పరిపాలనకు సంబంధించి అవినీతే అతిపెద్ద సమస్య అన్నారు ఎక్కడైనా సుపరిపాలన అందించాలంటే నైతిక విలువలే కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్యోక్తి యథా రాజా...తథా ప్రజను గుర్తు చేసుకోవాలి" అని చెప్పారు. 'అవినీతిపై పోరు, సంపదను తిరిగి రాబట్టడంపై ఫిబ్రవరి 13న ఇక్కడ జరిగిన తొలి ఇంటర్‌పోల్ అంతర్జాతీయ కార్యక్రమంలో సింగ్ ప్రారంభోపన్యాసం చేస్తూ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "పన్ను ఇబ్బందుల్లేని దేశాల్లో భారతీయుల నల్లధనం సుమారు 500 బిలియన్ డాలర్లు డిపాజిట్ చేసినట్లు అంచనా. స్విస్ బ్యాంకుల్లోని డిపాజిటర్లలో అత్యధికులు భారతీయులేనని నివేదికలు చెబుతున్నాయి." అని వివరించారు.

అంతర్జాతీయ పారదర్శక సూచీలో అతితక్కువ అవినీతి ఉన్న దేశాలుగా గుర్తించిన వాటిలో 53 శాతం దేశాల్లో నల్లధనం ఎక్కువగా డిపాజిట్ చేస్తున్నారని వెల్లడించారు. పన్ను ఇబ్బందుల్లేని దేశాల్లో రాజకీయ చిత్తశుద్ధి లోపించడం వల్లే అక్కడ నల్లధనం దాచుకున్న వారి వివరాలు రాబట్టడం కష్టమవుతోందన్నారు. పరిపాలనకు అవినీతి అతిపెద్ద సవాలుగా మారిందని తెలిపారు. అవినీతిపై పోరాడేందుకు ఒకే ఒక్క పరిష్కారమేది లేదన్నారు. "అనేక స్థాయిల్లో అవినీతిపై పోరు చేయాల్సి ఉంది. అభివృద్ధి కార్యక్రమాలను మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా రూపొందించాలి." అని తెలిపారు. కమ్యూనికేషన్ పరిజ్ఞానం, ఆర్థిక వ్యవహారాల్లో సరికొత్త పద్ధతులు అభివృద్ధి చెందడంలో అవినీతికి పాల్పడి దోచిన సంపదను చాలా సులభంగా విదేశాలకు తరలిస్తున్నారని వివరించారు. మరో వైపు న్యాయవ్యవస్థలోని బేధాలు, విచారణలో సమన్వయలేమి, అంతర్జాతీయంగా కొరవడిన సహకారం, బ్యాంకుల గోప్యత వల్ల అవినీతిని అడ్డుకోవడం ఆయా సంస్థలకు కష్టతరంగా మారిందని చెప్పారు. తరలిపోయిన సంపదను తిరిగి రాబట్టడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇతర దేశాలతో కలిసి పనిచేసేటప్పుడు పరస్పర నమ్మకం లోపించడం కూడా అవినీతిపై పోరుకు అవరోధంగా మారుతోందని తెలిపారు. ఇటీవల తాము విచారణ చేస్తున్న 2జీ, కామన్వెల్త్, మధుకోడా వంటి కేసుల్లో సొమ్ము దుబాయ్, సింగపూర్, మారిషస్‌ల మీదుగా స్విట్జర్లాండ్, ఇతర పన్ను ఇబ్బందుల్లేని దేశాలకు తరలిపోయినట్లు గుర్తించామని సింగ్ వెల్లడించారు. అవినతిని ఎదుర్కొవడం, సంపదను తిరిగి రాబట్టడంలో ఇంటర్‌పోల్, ఇతర సంస్థల ద్వారా అంతర్జాతీయ సమాజం మద్దతు అత్యవసరమని చెప్పారు. అవినీతికి వ్యతికంగా తొలిసారి జరుగుతున్న ఈ కార్యక్రమానికి 18 దేశాల అధికారులు హాజరయ్యారు. పెద్దఎత్తున అవినీతికి పాల్పడి కూడబెట్టిన సంపదను కనుగొని, తిరిగి రప్పించడంపై అధికారులకు అవగాహన, నైపుణ్యాలను పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సీబీఐ తెలిపింది. ◆

# ఆంధ్రప్రదేశ్‌లో 'అసర్' సర్వే ఫలితాలు

## యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు 2011 ( ASER అసర్)

**యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు ( ASER అసర్) 2005 -06 సంవత్సరం నుండి దేశంలోని విద్యాస్థితిగతుల గురించి పౌరసమాజం చేసే అతిపెద్ద సర్వే. దేశంలో 560 జిల్లాల్లో జిల్లాకి 30 గ్రామాలు, గ్రామానికి 20 ఇళ్లు, ర్యాండమ్‌గా ఎంపిక చేసి శాస్త్రీయంగా చేస్తున్న సర్వే ఇది. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో మొదలెట్టి డిశంబరులో పూర్తిచేసి జనవరిలో ఢిల్లీలో ఈ అసర్ రిపోర్టును విడుదల చేస్తున్నారు. ప్రథమ్ అనే స్వచ్ఛంద సంస్థ దేశంలోని పౌర సమాజ సంస్థలతో కలుపుకుని ఈ సర్వే నిర్వహిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 2005 - 06 లో లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించింది. ఆ తరువాత జిల్లాల్లోని డైట్ కాలేజీ విద్యార్థులతో సర్వే నిర్వహిస్తుంది. దీనికి లోక్‌సత్తా సంస్థ కూడా సహకారం అందిస్తున్నది. 2011 విద్యాస్థితిగతులపై నిర్వహించిన సర్వేలో తేలిన అంశాలని విశ్లేషిస్తూ రాసిన వ్యాసం ఇది.**

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అసర్-2011 నివేదికలోని వివరాలను పరిశీలిద్దాం.

**పాఠశాల విద్యార్థుల నమోదు**

6-14 వయోవర్గంలోని పిల్లల పాఠశాల నమోదు 97.2 శాతానికి చేరుకుంది. ఈ వయోవర్గంలో బడి బైటి పిల్లలు 2.8 శాతం ఉన్నారు. 7-16 వయోవర్గం పిల్లల్లో బడిబైట ఉన్నవారు 5.7శాతం. 7-10 వర్గంలో బడి బైటి పిల్లలు 1.1 శాతం మాత్రమే ఉన్నారు. ఈ వయోవర్గంలో బడి బైట ఉన్న బాలురు 0.8 శాతం కాగా బాలికలు 1.4 శాతం ఉన్నారు. 11-14 వయో వర్గంలో బడిబైట ఉన్న పిల్లలు 5.1 శాతం కాగా అందులో బాలురు 4.2 శాతం, బాలికలు 6శాతం ఉన్నారు. 15-16 వయోవర్గంలో బడిబైట పిల్లలు 20.7 శాతం కాగా అందులో బాలురు 19.1 శాతం, బాలికలు 22.2 శాతం ఉన్నారు.

6-14 వయోవర్గం పిల్లల్లో ప్రభుత్వ పాఠశాలల్లో



నమోదయినవారు 62.3 శాతం ఉండగా ప్రైవేటు పాఠశాలల్లో నమోదయినవారు 34.7 శాతం ఉన్నారు. 11-14 వయోవర్గం బాలికల్లో బడిబైట ఉన్న వారి సంఖ్య 2006లో 8.6శాతం ఉండగా 2009 నాటికి ఈ సంఖ్య 10.8శాతానికి పెరిగింది. అయితే 2011నాటికి ఈ సంఖ్య 6 శాతానికి తగ్గిపోవడం విశేషం.

**విద్యార్థుల హాజరు**

విద్యార్థుల హాజరు విషయానికి వస్తే ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 2007లో 75.9 శాతం ఉండగా 2011లో 75.2గా ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 2007లో 77.4 శాతం ఉండగా 2011లో 74.4 శాతానికి తగ్గింది. ఉపాధ్యాయుల హాజరు శాతం ప్రాథమిక పాఠశాలల్లో 2007లో 86.4శాతం ఉండగా, 2011లో 85.5శాతం ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2007లో 84శాతం ఉండగా, 2011లో 77 శాతానికి తగ్గింది.

మొత్తం మీద విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు గత నాలుగేళ్లలో తగ్గుముఖం పట్టిందని వెల్లడయ్యింది. అయితే ప్రధానోపాధ్యాయుల హాజరు మెరుగుపడిందని కూడా ఈ నివేదిక వెల్లడించింది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల హాజరు 2010లో 83.4శాతం ఉండగా 2011నాటికి 90 శాతానికి పెరిగింది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల హాజరు 2010లో 86.3శాతం కాగా 2011లో 89.7 శాతానికి పెరిగింది.

**తరగతి గదులు**

ఒకటి కంటే ఎక్కువ తరగతులను కలిపి కూర్చోబెట్టే పద్ధతి మన రాష్ట్రంలో పెరుగుతున్నది. 2వతరగతి పిల్లల్ని వేరే తరగతి పిల్లలతో కలిపి కూచోబెడుతున్న ప్రాథమిక పాఠశాలలు 2007లో 54.4 శాతం ఉండగా, 2011లో వీటి సంఖ్య 63.3 శాతానికి పెరిగింది. అలాగే 4వ తరగతి పిల్లల్ని వేరే తరగతి పిల్లలతో కలిపి కూచోబెడుతున్న ప్రాథమిక పాఠశాలలు 2007లో 46.9 శాతం ఉండగా, 2011లో 58.7 శాతానికి పెరిగాయి.

ప్రాథమికోన్నత పాఠశాలల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే ధోరణితో ఉన్నది. 2వ తరగతిని వేరే తరగతితో కలిపిన పాఠశాలలు 2007లో 50.5 శాతం కాగా 2011లో 48.8 శాతం ఉన్నాయి. 4వ తరగతిని వేరే తరగతితో కలిపిన పాఠశాలలు 2007లో 37.1 శాతం కాగా 2011లో వీటి సంఖ్య 44.1 శాతానికి పెరిగాయి.

**బోధనాభాష**

అసర్-2011లో తొలిసారిగా బోధనా భాష గురించిన సమాచారాన్ని సేకరించారు. మాతృభాషలోనే బోధన జరుగుతున్న పాఠశాలలు69.2 శాతం ఉన్నట్టు వెల్లడయ్యింది.

**అభ్యసనా సామర్థ్యాలు**

పిల్లల అభ్యసనా సామర్థ్యాల విషయానికి వస్తే 1వ తరగతి చదివే పిల్లల్లో అక్షరమ్ముక్క కూడా రానివారు 19.6 శాతం ఉంటే, అక్షరాలు మాత్రమే గుర్తుపట్టగలిగేవారు 48.7 శాతం ఉన్నారు. పదాలను చదవగలిగేవారు 25.1 శాతం ఉండగా, 1వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగేవారు 4.2 శాతం మాత్రమే ఉన్నారు.

3వ తరగతి చదివే పిల్లల్లో ఏమీ రానివారు 2.8 శాతం, అక్షరాలు గుర్తుపట్టగలిగేవారు 12 శాతం, పదాలు చదవగలిగేవారు 31.1 శాతం ఉన్నారు. 1వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగేవారు 29.9 శాతం, 2వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగేవారు 24.3 శాతం మాత్రమే ఉన్నారు.

5వ తరగతి చదివే పిల్లల్లో అక్షరం కూడా రానివారు 1.3 శాతం ఉండగా, అక్షరాలను మాత్రమే గుర్తుపట్టగలిగేవారు 3.9 శాతం, పదాలు చదవగలిగేవారు 11.1 శాతం ఉన్నారు. 1వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగేవారు 23.7 శాతం, 2వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలిగేవారు 60.1 శాతం ఉన్నారు.

లెక్కల విషయానికి వస్తే 1వ తరగతి చదివే పిల్లల్లో అంకెలను గుర్తించలేని వారు 16.5 శాతం ఉండగా, 1నుంచి 9 వరకూ అంకెల్ని గుర్త పట్టేవారు 42.1 శాతం, 11 నుంచి 99 వరకు సంఖ్యల్ని గుర్తు పట్టేవారు 37.3 శాతం ఉన్నారు. 3వ తరగతి చదివే పిల్లల్లో ఏమీ రానివారు 1.9 శాతం, 1 నుంచి 9 వరకూ అంకెల్ని గుర్తు పట్టేవారు 7.6 శాతం, 11 నుంచి 99 వరకూ సంఖ్యల్ని గుర్తు పట్టేవారు 44.5 శాతం, చిన్న చిన్న తీసి వేతలు చేయగలిగేవారు 39.9 శాతం ఉన్నారు.

5వ తరగతి చదివే పిల్లల్లో ఏమీరానివారు 1 శాతం,

1నుంచి 9వరకు అంకెల్ని గుర్తు పట్టేవారు 2.3 శాతం, 11 నుంచి 99 వరకు సంఖ్యల్ని గుర్తుపట్టేవారు 18.3 శాతం, చిన్న చిన్న తీసివేతలు చెయ్యగలిగేవారు 44.1 శాతం, చిన్న భాగహారం చెయ్యగలిగే వారు 38.2 శాతం ఉన్నారు.

పఠన, గణిత సామర్థ్యాల విషయంలో రాష్ట్రంలో అత్యధిక శాతం పిల్లలకు తరగతివారీ సామర్థ్యాలు లేవనీ, పిల్లలు తాము చదివే తరగతి స్థాయి కంటే రెండు, మూడు తరగతుల స్థాయి మేరకు వెనుకబడి ఉన్నారని అసర్-2011 నివేదిక వెల్లడించింది.

### ప్రాంతాల వారీ సమాచారం

విద్యారంగంలో ప్రణాళికా రచన, అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం జిల్లా స్థాయిలో జరుగుతుంటాయి. అసర్ సర్వే సైతం జిల్లా రిపోర్టు కార్డులను ప్రచురిస్తూ ఉండేది. జిల్లాల వారీ ఫలితాలను ప్రకటిస్తూ ఉండేది. అయితే అసర్-2011లో తొలిసారిగా ప్రాంతాల వారీ సమాచారాన్ని క్రోడీకరించడంతో ప్రాంతాల వారీ విద్యాస్థితిగతుల ధోరణులను అధ్యయనం చేయడానికి వీలు కలిగింది.

గతంలో అసర్ నివేదికలలో జిల్లాల వారీ సమాచారాన్ని అందచేసేవారు. ఈసారి ఆయా రాష్ట్రాలలోని ప్రాంతాల వారీ సమాచారాన్ని క్రోడీకరించి నివేదికలో పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల సమాచారం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. అసర్ సర్వే రాష్ట్రంలోని హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన 22 గ్రామీణ జిల్లాల్లో జరుగుతున్నందున, తెలంగాణ ప్రాంతా సమాచారంలో హైదరాబాద్ జిల్లా సమాచారం లేదన్న విషయాన్ని గమనించాలి.

6-14 వయోవర్గంలోని పిల్లల్లో బడి బైట ఉన్నవారి సమాచారం ఇలా ఉంది. కోస్తా ఆంధ్రలో బడిబైటి పిల్లలు 2007లో 4.39 శాతం ఉండగా, 2011 నాటికి వీరి సంఖ్య 2.67 శాతానికి తగ్గింది.

రాయలసీమలో బడిబైటి పిల్లలు 2007లో 5.14 శాతం ఉండగా 2011 నాటికి 3.42 శాతానికి తగ్గింది. తెలంగాణ ప్రాంతంలో బడిబైటి పిల్లలు 2007లో 3.64 శాతం ఉండగా, 2011లో 2.61 శాతానికి తగ్గింది.

ప్రైవేటు పాఠశాలల్లో నమోదవుతున్న పిల్లలు కోస్తా ఆంధ్రలో 2007లో 26.05 శాతం ఉండగా, 2011 నాటికి వీరి సంఖ్య 33.85 శాతానికి పెరిగింది. రాయలసీమ జిల్లాలో ఈ సంఖ్య 2007 నాటికి 27.29 శాతం కాగా, 2011 నాటికి 37.14 శాతానికి పెరిగింది.

1,2 తరగతులు చదివే పిల్లల్లో అక్షరాలను గుర్తించగలిగేవారు కోస్తా ఆంధ్రలో 2007లో 82.36 శాతం ఉండగా, 2011 నాటికి 89.66 శాతానికి పెరిగింది. రాయల సీమలో వీరి సంఖ్య 2007లో 84.89 శాతం ఉండగా 2011 నాటికి 86.91 శాతానికి పెరిగింది. అదే సంఖ్య తెలంగాణలో 2007లో 78.27 శాతం ఉండగా 2011 నాటికి 84.46 శాతానికి పెరిగింది.

1,2 తరగతి చదివే పిల్లల్లో 1 నుంచి 9 వరకూ అంకెలను గుర్తించగలిగే వారి సంఖ్య కోస్తా ఆంధ్రలో 2007లో 87.18 శాతం ఉందగా 2011 నాటికి 91.50 శాతానికి పెరిగింది. ఈ సంఖ్య రాయలసీమలో 2007లో 88.68 శాతం ఉండగా, 2011 నాటికి 90.68 శాతానికి పెరిగింది. అదే తెలంగాణలో 2007లో 82.16 శాతం ఉండగా, 2011 నాటికి 86.76 శాతంగా ఉంది.

3,4,5 తరగతులు చదివే పిల్లల్లో 1వ తరగతి స్థాయి పాఠాన్ని చదవగలితే వారు కోస్తాంధ్రలో 2007లో 78.22శాతం ఉండగా, 2011 నాటికి 78.40 శాతానికి చేరింది. రాయలసీమలో ఇదే సంఖ్య 2007లో 75.81 శాతం ఉండగా, 2011 నాటికి 68.34 శాతంగా నమోదయ్యింది. అలాగే తెలంగాణలో ఈ సంఖ్య 2007లో 69.26 శాతం ఉండగా 2011 నాటికి 63.03 శాతానికి తగ్గింది.

3,4,5 తరగతులు చదివే పిల్లల్లో చిన్న తీసివేత లెక్కలు చెయ్యగలిగే వారు కోస్తాంధ్రలో కోస్తాంధ్రలో 2007లో 67.59 శాతం ఉండగా, 2011 నాటికి 70.68 శాతానికి చేరింది. రాయలసీమలో ఇదే సంఖ్య 2007లో 70.12 శాతం ఉండగా, 2011 నాటికి 67.02 శాతంగా నమోదయ్యింది. ◆

## రచనలకు ఆహ్వానం

లోక్‌సత్తా టైమ్స్‌లో ప్రచురణకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో అధ్యయన వ్యాసాలను విశ్లేషణలను ఆహ్వానిస్తున్నాం. నూతన రాజకీయ సంస్కృతిని ప్రతిబింబించే రచనలను పంపవలసిందిగా కోరుతున్నాం.

# ఓటు హక్కు-వినియోగించుకోని పౌరులు

- ఎ. అన్నపూర్ణ



ప్రజాస్వామ్య దేశాల్లో ప్రజలందరికీ సమానంగా గల ఏకైక హక్కు ఓటు హక్కు. ఎన్నికలు జరిగినప్పుడు ఓటు హక్కును సక్రమంగా ఉపయోగించుకోనప్పుడు జరిగేనష్టాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రజాసేవ చేయాలనే సచ్ఛీలురైనవారిని నిజాయితీ గల ఆశయాలకు అనుగుణంగా నడుచుకునే స్వచ్ఛమైన నాయకులను ఎన్నుకునే సాధనం ఓటు. అయితే ఎన్నికలు జరుగుతున్న ప్రతిసారీ పోలింగ్ శాతం అనూహ్యంగా దిగజారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో నమోదైన పోలింగ్ శాతం లోక్‌సభ నియోజకవర్గాల కంటే తక్కువగా వుంది. హైదరాబాద్‌లో 52.46 శాతం సికింద్రాబాద్‌లో 55 శాతం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో 51.60 శాతం మాత్రమే నమోదు కాబడింది. 2009 గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే తీరుగా వుంది. ఆ ఎన్నికల్లో 42.09 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. గ్రేటర్ పరిధి ఓటర్ల సంఖ్య 57 లక్షలు పైగా వున్నారు. కాని పోలైన ఓట్లు మాత్రం 31 లక్షలు కూడా లేరు.



కేవలం మన రాష్ట్రంలోనే కాదు దేశ వ్యాప్తంగా పౌరులు తక్కువ శాతం ఓట్లు వేస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. అవినీతిపరులను అందలాలు ఎక్కించడానికి మార్గం సుగమం చేసి చేజేతులా వినాశనం కలిగిస్తున్నా మన్న మాట! మంచి పని తలపెట్టినప్పుడు సామాన్య పౌరుల కంటే విద్యావంతులు సహకరించి ముందుకు వస్తారని ఆశాభావం వుండేది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు మాత్రమే ఓటు వేస్తారు కనుక అంచనాలకు మించి పోలింగ్ జరుగుతుందని సామాన్యులు సైతం ఆశపడ్డారు. కానీ కేవలం 27శాతం అంటే 2,12,519 మంది ఓటర్లు వుంటే ఆ హక్కును వినియోగించుకున్నది. 57 వేల మంది మాత్రమే అని తెలిసినప్పుడు తీవ్రమైన నిరాశా నిస్పృహలు ఆవరించాయి. అందులోనూ హైదరాబాద్ నగరంలోనే ఎక్కువ మంది బద్ధకస్తులు వున్నారు. విద్యావంతుల శాతం 22.40 మాత్రమే. నేను స్వయంగా తెలిసిన వారందరికీ ఓటు వేయాల్సిందిగా కోరితే అత్యుత్సాహంగా ఓటు వేశారు. అదీ అప్లికేషన్ ఫారాలిచ్చి నమోదు చేయిస్తే.

మన దేశంలో 1950 జనవరి 25న ఎన్నికల సంఘం

ఏర్పడింది. అంటే ఇప్పటికి వజ్రోత్సవం జరుపుకుంది. ఫలితం మాత్రం కాలాన్ని వెనక్కి నెడుతోంది. అయితే ఓటర్లలో నిరాశక్తతకు కారణం ఏమిటి? ఓటు పై అవగాహన లేకనా, ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నా గుర్తింపు కార్డుల జారీలో అవకతవకలు జరిగినందువల్లనా? ఇటీవల మల్కాజ్‌గిరి పరిధిలో ఓటరు గుర్తింపు కార్డులు చెత్తకుప్పలో కనిపిస్తే ఆ ప్రాంతాల ప్రజలు వారి వారి ఓటరు కార్డులను వెదికి తెచ్చుకున్నారంటే ఇంతటి నిర్లక్ష్యానికి కారకులెవరు? అధికారులకే తెలియాలి.

గ్రామీణ ప్రాంతాలు మన రాష్ట్రంలోనే ఎక్కువ అక్కడి వారే ఎక్కువమంది ఓటు వేస్తున్నారు. వెనుక బడిన మహబూబ్ నగర్ జిల్లాలోనే అన్ని ఎన్నికల్లోనూ ప్రజలు చురుగ్గా పాల్గొని ఓటు వేయడం హర్షణీయం గుర్తింపు కార్డులు విషయంలో తప్పులు, పొరబాట్లు జరగడం మళ్ళీ మళ్ళీ నమోదు చేసుకోవాల్సి రావడంతో ప్రజలు విసిగి పోయారు. కార్డులిచ్చినా నమోదు కాబడిన లిస్ట్‌లో పేరు కనబడదు. పేరుంటే చిరునామా తప్పుగా వుంటుంది. అన్నీ అనుకూలంగా వున్నాయిలే అనుకుని తీరా ఓటు వేయడానికి వెడితే అప్పటికీ ఎవరో ఓటు వేస్తారు. అంటే ఉదయం వేళ లేదా లంచ్ బ్రేక్‌లో మాత్రమే వేటు వేస్తే కొంత ప్రయోజనం వుంటోంది. మనకి ఎన్నికల రోజు సెలవు ప్రకటిస్తుంది. ప్రభుత్వం కాని ఆశలవును మరో ఎంజాయ్ మెంట్‌కి ఉపయోగిస్తారు కొందరు. అదే అమెరికాలో సెలవు వుండదు. అయినా అక్కడి ప్రజలు తప్పకుండా ఓటు వేస్తారు. గత ఎన్నికల్లో మొదటిసారి అమెరికా దేశ పౌరురాలుగా మా అమ్మాయి ఓటు వేసింది. అదీ ఆఫీస్ నుంచి వస్తూ చిట్టచివరగా! ఒబామా విజయం సాధించినప్పుడు తన ఒక్క ఓటు కారణంగానే ఆయన ఎన్నికైనట్టు మురిసిపోయింది. రిజల్ట్ వచ్చాక. నాకు చాలా గర్వం కలిగింది. ఏ దేశంలో అయితేనేం తానొక పౌరురాలు తప్పని సరిగా ఓటు వేయాలనే ఆలోచన అమ్మాయికి వచ్చినందుకు.

అంటే అధికారులు కొన్ని పొరబాట్లు చేసినప్పటికీ ప్రజల్లో కూడా ఒక బాధ్యత వుండాలి. ఓటు వేయకపోతే జరిగే నష్టం ఏమిటో అర్థం చేసుకోవాలి. ఈ మధ్య మా బంధువులింట్లో శుభకార్యానికి వెళ్ళినప్పుడు కొందరు మహిళలతో పరిచయం కలిగింది. మీరేం చేస్తుంటారూ అని ఒకరికొకరు తెలుసుకోవడంలో ప్రస్తుత పరిస్థితులు (రాజకీయాలు) ఎలక్షన్స్ గురించి ప్రసక్తి వచ్చింది. మీరు ఎవరికి ఓటు వేశారు? అంటే ఇప్పటి దాకా నేను ఓటు వేయలేదన్నారు ఇద్దరు అలా తటస్థంగా వుండవద్దు. ఓటు వేయకపోతే ఎలాంటి అవినీతికి ఆస్కారమవుతుందో ఓటు ఆవశ్యకత గురించి వివరించారు. వారు నిరక్షరాస్యులు కారు. ఏదో ఇంటి పని చేసుకుంటూ ఏమీ పట్టించుకోని వారు కాదు. భర్త వ్యాపారంలో సలహాలిస్తూ వారికి సహకరిస్తూండే వారే. వారు రాజకీయాల గురించి మన కెందుకు మన కుటుంబం ఆర్థిక స్థితి వరకూ అంతా బాగానే వుందికదా అనే పరిధిలో ఆలోచిస్తారు తప్ప మిగిలిన విషయాల పట్ల శ్రద్ధ వుండదు. కాని ప్రతీ మహిళా తన వరకే అనే ఆలోచన నుంచి బైటపడాలి. దేశపరిస్థితి ఎన్నికలు రాష్ట్రాలకు ప్రజలకు జరుగుతున్నది ఏమిటీ మన వరకూ ఈ దేశ పౌరులుగా మన బాధ్యతను ఎంతవరకూ సక్రమంగా నెరవేర్చగలం అనే ఆలోచన తప్పని సరిగా వుండాలి. మా నాన్నగారు ఓటు విలువను రాజకీయాలపై ఓటు ప్రభావాన్నీ నాకు వివరించి చెప్పడం వల్లనే నేను ఏనాడూ ఓటు వేయడం మానలేదు. అందుచేత ఇంట్లో తల్లితండ్రులు కూడా పిల్లలకు ఓటు గురించి అవగాహన కల్పించాలి. ప్రతి ఒక్కరూ రాజకీయాలను పట్టించుకోవాలి. రాజకీయాలంటేనే చెత్త, మురికి, అవినీతి సుడిగుండం అనే పరిస్థితిని మార్చగల వారు మహిళలు, విద్యార్థులే. మిగిలిన వారు ఓటు వేసినా అది చాలదు. అక్రమాలను అవినీతిని అంతమొందించడానికి ప్రతి ఒక్కరూ కదిలిరావాలి. ఇది ఎవరికోసమో కాదు. పౌరులుగా అందరి బాధ్యతా అని మరవద్దు. ప్రజల మౌనమే వారి భవిష్యత్‌కు చేటు తెస్తుంది. ఈ దేశం ఈ రాష్ట్రం స్థితిగతులను మార్చేది పౌరులే. ఎవరో ఎక్కణ్ణించో వచ్చి మనకు అన్ని అమర్చిపెట్టారు. మనకు మనమే మార్చుకోకపోతే మరింత అధోగతికి దిగజారుతుంది. ఇప్పటికే ప్రజలు పట్టించుకోనందు వల్లనే రాజకీయాలు అస్తవ్యస్తమై పోయాయి. దురాశాపరులు దీన్ని అలుసుగా తీసుకుంటున్నారు. సామాన్య ప్రజలకు తీవ్రనష్టం కలిగిస్తున్నారు. అమాయకులు వ్యసనాలకు బానిసలైన వారు నోటిచ్చిన వారికి ఓటు వేసి తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. వీరంతా ఇకనైనా కళ్ళు తెరిచి తమ హక్కులను కాపాడుకుంటూ విలువైన తమ జీవితాలను బాగుచేసుకుంటారని ఆశిద్దాం. ◆

# 'అవినీతిరహిత ఒంగోలు' విద్యార్థులతో పీపుల్ ఫర్ లోక్‌సత్తా ప్రయోగం




ఒంగోలు పట్టణంలో పిఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న ఎకెవికె కాలేజీలో "అవినీతి లేని ఒంగోలు" అంశంపై డిబేట్ కార్యక్రమం జరిగింది. ఎంపిక చేసిన 12 కాలేజీలలో ముందుగా డిబేట్ నిర్వహించి విజేతలుగా నిలిచిన జట్లతో "గ్రాండ్ ఫినాలే" జరిగింది. ఇందులో న్యాయ నిర్ణేతలుగా డా॥సుధాకర్, చప్పిడి రత్నకుమారి, మహ్మద్‌రఫీ, షేక్‌జిలాని వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి స్నేహితులు, కళాశాలల అధ్యాపకులు, యజమాన్యాలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. పోటీలో పాల్గొన్న యువతీ, యువకులు ఎంతో ఆత్మవిశ్వాసంతో, ఆవేశంతో ఉపన్యసించారు. అవినీతికి గల కారణాలు, దాని అంతానికి అవసరమైన విధానాలు, మంచి రాజకీయాల అవశ్యకత, యువత, విద్యార్థులు పోషించాల్సిన పాత్ర మొదలగు అన్ని అంశాలపై చర్చించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దలు పాటిబండ్ల గోపాలస్వామి, విద్యావేత్త కంచర్ల రామయ్య, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, జిల్లా లోక్‌సత్తా అధ్యక్షులు అల్లుశివరమేష్ రెడ్డి, డా॥ రాధాదేవి పాల్గొన్నారు. పిఎఫ్ఎల్ సంస్థ ప్రతినిధి అమెరికా నుండి వచ్చిన శ్రీనివాస్ గుళ్ళపల్లి ఆధ్వర్యంలో కార్యక్రమం మొత్తం కొనసాగింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ (కందుకూరు), నిమ్రా ఇంజనీరింగ్ కాలేజ్, ఎకెవికె కాలేజీలు మెమోంటోతో పాటు వరుసగా రూ॥5000/-, 3000/-, 2000/- ప్రైజ్‌మనీనీ గెలుచుకున్నారు. వ్యక్తిగతంగా విశిష్టప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక బహుమతులు, పోటీలలో పాల్గొన్న అన్ని కళాశాలలకు జ్ఞాపికలు ఇవ్వడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించిన కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ప్రత్యేకంగా "ప్రిన్సిపాల్ ఆఫ్ చేంజ్" సర్టిఫికేట్‌తో సత్కరించారు.

**ఈ డిబేట్ కార్యక్రమంలో ఈక్రింది కళాశాలలు పాల్గొన్నాయి.**

ఎకెవికె డిగ్రీకాలేజీ, గీతం డిగ్రీ కాలేజీ, సక్కుబాయి అమ్మ ఉమెన్స్ కాలేజీ, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ, పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్ & సైన్స్, శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజీ,

నిర్మలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ, శ్రీజి డిగ్రీకాలేజీ, (మద్దిరాలపాడు), క్విజ్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ, రావ్ & నాయుడు ఇంజనీరింగ్ కాలేజీ, రైజ్ ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ, మద్దిపాడు జూనియర్ కాలేజీలు.

**ఈ కార్యక్రమం ఎలా ప్రారంభమైంది అంటే...**

ఒంగోలులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించటానికి ముందుగా ఎంపిక చేసిన 12 కళాశాలలకు వెళ్లి 'అవినీతిరహిత ఒంగోలు'ను ప్రకటిద్దామని అందుకోసం చర్చాకార్యక్రమాలను ఏర్పాటుచేద్దామని తెలియచేసి ఒప్పించారు.

**చర్చ ఎలా జరుగుతుందంటే...**

ప్రతి కళాశాలలో 4గురు సభ్యులతో కనీసం 4 జట్లను ఏర్పాటుచేస్తారు. ప్రతి జట్టులో కనీసం ఒక విద్యార్థిని ఉండేలా చూసుకునే ప్రయత్నం జరుగుతుంది. జట్ల సంఖ్యకు పరిమితి అంటూ లేదు.

**చర్చలో భాగంగా...**

- ప్రతి జట్టూ తన వాదనను వినిపించేందుకు 5 నిమిషాలు

# అవినీతిరహిత రాజకీయానికి పి.ఎఫ్.ఎల్ కృషి

ఎదుటివ్యక్తి బలాల్ని ప్రేరేపించటం ద్వారా వారిని ఆకట్టుకునేది ఉత్తమ నాయకత్వం, ఎదుటివ్యక్తి బలహీనతల్ని అడ్డంపెట్టుకుని వారిని ఉపయోగించుకునేది అధమ నాయకత్వం. మంచిరాజకీయం అంటే ఉత్తమ నాయకత్వంతో ప్రజలలో స్ఫూర్తిని నింపుతూ, ఆలోచనను పెంచుతూ వారిని ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, స్వావలంబనగల పౌరులుగా తీర్చిదిద్దుతూ వారిని సమీకరించటం. మంచిరాజకీయం చేసే పార్టీ అలాంటి స్ఫూర్తిదాయక రాజకీయంతో ప్రజలలోకి విస్తరిస్తూ బలోపేతమవుతుంటుంది, అధమ నాయకత్వ లక్షణాలతో ప్రజల బలహీనతల్ని రెచ్చగొడుతూ వారిని శాశ్వత బిచ్చగాళ్లుగా, కేవలం ఓటుబ్యాంకులుగా కొనసాగిస్తూ 19వ శతాబ్దపు రాజకీయాలు చేస్తున్న పెత్తందారీ, సాంప్రదాయ రాజకీయ(సా.రా)పార్టీలకు కొన్ని అడ్డదారులుంటాయోమోగానీ, 21వ శతాబ్దపు ఆర్థికవ్యవస్థకు కావలసిన మంచి రాజకీయం విజయానికి మాత్రం త్యాగాలు అవసరం లేకుండా నిలకడగా పనిచేస్తుండటమే మార్గం.

అందుకే రాష్ట్ర, దేశ ప్రజలు సుదీర్ఘంగా ఎదుర్కొంటున్న అవినీతి మహమ్మారిపై విద్యార్థులను చైతన్యపరిచి రాజకీయ పరిష్కార మార్గం దిశగా వారిని నడిపించేందుకు 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' (పీఎఫ్ఎల్) ఒంగోలులోని వివిధ కళాశాలల్లో కార్యక్రమాన్ని చేపట్టింది. రాజకీయ ఉద్యమంగా అవినీతిపై దాదాపు 16 ఏళ్లుగా పోరాడుతున్న లోక్‌సత్తా చెబుతున్న పరిష్కారాలను విద్యార్థులలోకి తీసుకెళ్లి అవగాహన పెంచటంతోపాటు... ఆ సమస్యను పరిష్కరించేందుకు విశ్వసనీయ రాజకీయ వేదికగా ఉన్న లోక్‌సత్తా పార్టీని వారు సాధనంగా ఉపయోగించుకునేలా చేయటం పీఎఫ్ఎల్ లక్ష్యం.

"మాకు ఈ అవినీతి వ్యవస్థ వద్దు. మాకు మెరుగైన సమాజం కావాలి. భారతదేశాన్ని అవినీతిరహితంగా చేయటానికి మావంతు చేయగలిగిందంతా చేస్తాం. ఒంగోలు నుంచి ఆ ప్రయత్నాన్ని ప్రారంభించటం మాకు చాలా ఉత్సాహాన్నిస్తోంది" అని అక్కడి స్థానిక కళాశాలల్లోని విద్యార్థులందరూ ముక్తకంఠంతో పేర్కొన్నారు. వారిచ్చిన స్ఫూర్తి, ఉత్సాహంతోనే 'అవినీతిరహిత ఒంగోలు' పేరుతో ప్రకాశం జిల్లాలో చేస్తున్న ఈ పైలెట్ ప్రాజెక్టును ఇతర జిల్లాలలో కూడా ప్రారంభించాలని పీఎఫ్ఎల్ యోచిస్తోంది.

**కార్యక్రమానికి సారథ్యం వహిస్తున్న పీఎఫ్ఎల్ బృందం:**

**శ్రీనివాస్ గుళ్లపల్లి, రజని వీరమాచినేని, వెంకటరావు, మురళీధర్ ముప్పరాజు, ప్రసాద్ రావెల, కిషోర్.జి, పవన్ కల్వకుంట, ప్రదీప్ మైల, రాజా పతంగి, రమ ఆలూరి, లక్ష్మీనారాయణ, నారాయణరావు (వీరంతా ప్రధానంగా అమెరికా కేంద్రంగా తమ కృషిని కొనసాగిస్తున్నారు.**

పీఎఫ్ఎల్ కృషిపై మరిన్ని వివరాలకు : **www.peopleforloksatta** వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు)

ఇస్తారు

- చర్చలో పాల్గొంటున్నవారు తమ చుట్టూ జరిగిన, తాము సమాజంలో గమనించిన వాస్తవ ఘటనల్ని, ఉదాహరణల్ని ప్రస్తావిస్తే ఇంకా ప్రభావవంతంగా ఉంటుంది. సమాచారహక్కు చట్టం ద్వారా అవినీతి కలాపాల్ని వెలికితీసిన ఘటనలైతే మరీ మంచిది.
- మొదటిరౌండ్‌లో అన్ని జట్లూ అభిప్రాయాల్ని వెలిబుచ్చాక 10 నిమిషాలు విరామం
- ఇక రెండవ రౌండ్‌లో తొలుత వినిపించిన వాదనల్ని హేతుబద్ధంగా సమర్థించుకునే రౌండ్. ఈ క్రమంలో జట్టు సభ్యులు తమ బృంద నాయకునికి సహాయంగా వాదనలు వినిపించవచ్చు.
- లోక్‌పాల్ సహా అవినీతికి వ్యతిరేకంగా వ్యవస్థీకృత మార్పు తెచ్చే వివిధ అంశాల మీద కూడా కొత్త వాదనల్ని, పరిష్కారాల్ని తెలియచేయవచ్చు.

**ఇవీ నిబంధనలు...**

- వాదనలలో ఎవరి మీదా వ్యక్తిగత ఆరోపణలు చేయకూడదు.
- ప్రతి వాదనకూ నిర్దిష్టమైన అధికారిక ఆధారాన్ని చూపాలి. డాక్యుమెంట్లు ఉంటే మరీ మంచిది.

**క్రియాశీల స్పందన**

ఈ రకంగా అవినీతిరహిత ఒంగోలు కార్యక్రమాన్ని ఆంధ్రకేసరి విద్యాకేంద్రం నుంచి ప్రారంభించి ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల, పి.ఎ.సి.ఇ, గీతం, సక్కుబాయమ్మ, ఎస్.ఆర్.కె, శ్రీజి తదితర కళాశాలల్లో పీఎఫ్ఎల్ నిర్వహించింది. దాదాపు 500మంది విద్యార్థులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇందులో పాల్గొన్నారు. వారిలో 50మంది లోక్‌సత్తా కార్యక్రమాలలో క్రియాశీలంగా పాల్గొనేందుకు చురుగ్గా ముందుకొచ్చారు. తొలిప్రయత్నంగా 12 కళాశాలల్ని లక్ష్యంగా పెట్టుకుని పైలెట్ ప్రాజెక్టుని నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమానికి ముగింపు సభను వివిధ కళాశాలల మధ్య భారీస్థాయి చర్చావేదికగా (అంతర్ కళాశాల పోటీగా) నిర్వహించి తల్లిదండ్రులను, యాజమాన్యాలను సత్కరించడం. ఎక్కువమంది విద్యార్థులను, తల్లిదండ్రులను అవినీతిపై పోరాటంలో లోక్‌సత్తాకున్న నిబద్ధతను, అవినీతి నిరోధానికి లోక్‌సత్తాకున్న మాత్రమే ఉన్న స్పష్టమైన విధానాలను వివరించి సాధ్యమైనంత ఎక్కువమంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పార్టీ సభ్యులుగా చేసే ప్రయత్నం చేయటం ముఖ్య లక్ష్యం. ◆



# లోక్‌సత్తా సహకారంతో మాట్లాంలో మంచినీటికి ఆర్ ఓ ప్లాంట్

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గంలో మాట్లాం ఒక గ్రామం. ఇది ఇప్పుడు వార్తలలోకి ఎక్కింది. లోక్‌సత్తా అభ్యర్థిగా శేషమ్మ అనే గృహిణి గ్రామ పంచాయితీ వార్డు సభ్యురాలిగా ఎన్నికైంది. సమాజహితం కోరే వారిని ఎన్నుకోవాలని పట్టుదలతో కృషి చేసిన లోక్‌సత్తా సభ్యుల బృందం విజయాన్ని సాధించింది.

ఎన్నికకాగానే ఈ గ్రామాభివృద్ధికి ఒక పెద్ద కార్యక్రమాన్ని చేపట్టాలని ఈ బృందం భావించింది. కలుషిత నీరు తాగి గ్రామస్తులు రోజువారీ తెచ్చుకుంటున్న జబ్బుల నివారణకు "శుద్ధి చేసిన మంచినీరు" అందించే పధకం చేపట్టాలని తలపెట్టారు. గ్రామస్తులు కొంతమంది ఇప్పటికే 20 లీటర్ల నీటి డబ్బాను 15 రూపాయలకు కొనుక్కుంటున్నారు. ఇది పేదలకు అందుబాటు కానిది అయింది. శేషమ్మ బృందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా అక్కడ ఎవరూ పట్టించుకోలేదు. అందుచేత తమంతట తామే అలాంటి శుద్ధి చేసిన నీటిని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

నవయుగ సేవాసంఘం పేరుతో ఒక యువజన సంఘాన్ని ఏర్పాటు చేశారు. నీటిని శుద్ధి చేసే రివర్స్ ఆస్మోసిస్ ప్లాంటుకు 5 లక్షలు ఖర్చు అవుతుంది. దీనికి విదేశాలలో వున్న లోక్‌సత్తా అభిమానులు తోడ్పాటు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. మాట్లాంలో లోక్‌సత్తా అభిమానుల కుటుంబాలకు చెందినవారు లేటు తిరుమాని సీతయ్య, మంగమ్మ – లేటు మొకా శ్రీరామమూర్తి, లక్ష్మణస్వామి పేర్లమీద ఈ ప్లాంటుకు అవసరమైన స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. పలు ప్రాంతాలకు చెందిన లోక్‌సత్తా అభిమానులు ఆర్థిక సహాయం అందించారు. ఏడుకొండలు నాయకత్వంలో దాని నిర్మాణపనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ ప్లాంటుకు 2011 నవంబరు 6న శంకుస్థాపన జరిపారు.

ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టిన లోక్‌సత్తా నాయకులు ఏడుకొండలును, దీనికి తోడ్పాటునిచ్చిన లోక్‌సత్తా సీమాంతర అభిమానులను, ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న కృష్ణా జిల్లా లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి వజీర్‌ను లోక్‌సత్తా పార్టీ అభినందిస్తున్నది. ◆



# రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

- జయప్రకాష్‌నారాయణ్

**నరసరావుపేట మండలంలో**
**స్వతంత్ర రైతు సంఘాల నిరాహార దీక్షలు**

**బా**నిస బతుకుల నుంచి బయట పడాలంటే రైతులు సంఘటిత పోరాటం సాగించాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో ఫిబ్రవరి 5న జరిగిన రైతులతో ముఖాముఖీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఏ ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో వేసింది. దిగుబడి, ధరలు ఎలా ఉన్నాయి తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు రైతులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇతర దేశాల్లో వ్యవసాయ రంగానికి ప్రభుత్వాలు అండగా నిలుస్తుంటే, రాష్ట్రంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉందన్నారు. రైతే రాజని, పల్లెసీమలే పట్టుకొమ్మలని పాలకులు ప్రకటనలు చేస్తారే తప్ప వారి సంక్షేమాన్ని పట్టించుకోవటం లేదన్నారు. రెండేళ్ళ క్రితం బి.పి.టి. ధాన్యం రూ॥1500 ధర పలికితే ప్రస్తుతం రూ॥750 ఉందన్నారు. ఖర్చులు, కూలీ, విత్తనాల ధరలు పెరిగాయి. ఆదాయం మాత్రం 30 శాతం తగ్గిందన్నారు.

రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు కోటి 60 లక్షల మంది ఉన్నారని, వారంతా ఒకటైతే సమస్యలు పరిష్కరించటం సులభమవుతుందని సూచించారు. 300 మంది ఐ.ఎ.ఎస్.లు, తొమ్మిది లక్షల మంది ఉద్యోగులు ప్రభుత్వాలను గడగడలాడిస్తుంటే. కోటికి పైగా ఉన్న రైతులు తమ సమస్యలపై ఎందుకు పోరాటం సాగించరని ప్రశ్నించారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు భానుప్రసాద్, గోపిచంద్, లలితకుమారి, నిర్మలాబోసు, రైతు సంఘాల సమాఖ్య ప్రతినిధులు పాల్గన్నారు. తొలుత జేపీని ఎడ్లబండిపై ఎక్కించి సభా వేదిక వద్దకు తోడ్కొని వెళ్ళారు.

### రైతు సమస్యలపై లోక్‌సత్తా పోరు

నరసరావుపేటలో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన రిలేనిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించారు. విశ్రాంతి వ్యవసాయాధికారి అమరేంద్ర, ఈదర గోపిచంద్ రచించిన పుస్తకాలను ఆయన అవిష్కరించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు భానుప్రసాద్, మహిళా సత్తా జిల్లా అధ్యక్షురాలు లలితకుమారి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివనాగేశ్వరరావు, స్థానిక నేతలు నరసింహారావు, హరిబాబు, నిర్మలబోస్ తదితరులు పాల్గన్నారు. తొలుత కృష్ణవేణి కళాశాలకు చెందిన విద్యార్థులు ద్విచక్రవాహనాలపై ప్రదర్శనగా వెళ్ళి జయప్రకాష్‌నారాయణ్‌ను శిబిరం వద్దకు తీసుకువచ్చారు. ◆



# ఉత్తరప్రదేశ్ హైకోర్టులో షుగర్ మిల్స్‌కు చుక్కెదురు

- చెరుకు సూచిత ధరలో జోక్యం చేసుకోలేదని తీర్పు
- పాయింటు లేకుండా కోర్టు కెక్కినందుకు 50 లక్షల జరిమానా

2011-12 సంవత్సరానికి చెరుకు సూచిత ధరను పెంచుతూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తరువులను సవాలుచేస్తూ తూర్పు ఉత్తర ప్రదేశ్ షుగర్ మిల్స్ అసోసియేషన్ మరికొంతమంది మిల్లు యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన అల్హాబాద్ హైకోర్టు లక్నో డివిజన్ బెంచి ఆ పిటీషన్‌ను కొట్టివేసింది.

2011-12 సంవత్సరానికి చెరుకు సీజనులో మిల్లులు చెల్లించాల్సిన సూచిత ధరను మాయావతి ప్రభుత్వం ప్రకటించింది. వివిధ రకాల చెరుకులకు టన్నుకు 2500 రూపాయలు, 2400 రూపాయలు, 2350 రూపాయలుగా ప్రకటించింది.

లక్నో బెంచి న్యాయమూర్తులు జస్టిస్ దివిప్రసాద్‌సింగ్. జస్టిస్ సౌరాసియాలు తమ తీర్పులు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన సూచిత ధరలో కోర్టు జోక్యం చేసుకోవలసిన న్యాయపరమైన అంశాలు లేవని అందుచేత ఈ పిటీషన్‌ను తోసిపుచ్చుతున్నామని తీర్పునిచ్చారు.

రికార్డులలో వున్న సమాచారాన్ని బట్టి చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ పిటీషన్‌ను ఎగ్జంప్లరీ కాస్ట్స్‌తో కొట్టివేశారు. పాయింటు లేకుండా కోర్టు కెక్కినందుకు 50 లక్షల రూపాయలు జరిమానాను విధించారు. ఈ మొత్తాన్ని రెండు నెలలులోగా జమ చెయ్యాలని ఆదేశించారు. ఇందులో 25 లక్షల రూపాయలు షహజానాపూర్‌లోని చక్కెర పరిశోధనా సంస్థకి, మరో 25 లక్షల రూపాయలు లక్నో బెంచికి సంబంధించిన మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ సెంటరుకు జమచెయ్యాలని ఆదేశించారు.

మన రాష్ట్రంలో చెరుకు సూచిత ప్రకటించకుండా రాష్ట్రప్రభుత్వం కోర్టుకేసును సాకుగా చూపించడం విడ్డూరంగా కనిపిస్తున్నది. గతంలో సుప్రీంకోర్టు కూడా సూచిత ధరపై ఇదే తరహా తీర్పు ఇచ్చిన అంశాన్ని కూడా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతుల్ని కొట్టి మిల్స్‌కి లబ్ధి చేకూర్చడమే రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది. ఈ తీర్పు తర్వాతనైన రాష్ట్రప్రభుత్వం సూచిత ధర ప్రకటనకు ముందుకు రావాలి. ◆



# ప్రజలను తాగుబోతులను చేస్తున్న ప్రభుత్వాలు




## విజయనగరం జిల్లా

మయూరి కూడలి : జిల్లాలో మద్యం అమ్మకాలు తీరుచూస్తే ఎంతటివారికైనా జిల్లాపై జాలికలగక మానదని, అతి పెద్దస్థాయిలో మద్యం సిండికేట్ ప్రజలను తాగుబోతులుగా తయారు చేసిందని లోక్‌సత్తాపార్టీ జిల్లా అధ్యక్షులు భీశెట్టిబాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు వీధుల్లో సిండికేట్ శకటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2000-01 సంవత్సరంలో రూ॥63 కోట్లు మద్యం అమ్మకాలుంటే 2009-10 నాటికి రూ॥345 కోట్లకు పెరిగాయని, తక్కువ సమయంలో ఎక్కువ శాతం మద్యం అమ్మకాలు సాగించి జిల్లా రాష్ట్రంలో మూడోస్థానం సంపాదించిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు మన నాయకులు మంచినీరు అందించకపోయినా చిత్తశుద్ధితో మద్యం అందించడంలో విజయం సాధించారన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియడానికి మద్యం శకటాన్ని వీధుల్లో తిప్పుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుభద్రాదేవి, ఉదయగౌరి, రాయి పద్మావతి, పి.వి.రమణ, కె.దయానంద్, దాలి పెంటయ్య రాంబాబు, ఎర్రిబాబులు పాల్గొన్నారు.

## పజలు ప్రశ్నించే తత్వం అలవర్చురోవాలి

విజయనగరం టౌన్ : మున్సిపాల్టిల్లో పౌర సేవలు అందకపోతే ప్రభుత్వాన్ని పాలకులను ప్రజలు ప్రశ్నించే స్థాయికి చేరుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర శిక్షకులు, జిల్లా శిక్షకులు బి.సాంబి రెడ్డి, విజయ్ కుమార్‌లు అన్నారు. స్థానిక 1,20వ వార్డులో కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిబిరంలో మహిళాసత్తా ప్రతినిధులు ఐ.అనంతలక్ష్మీ, ఉదయ గౌరి, పల్లాతులసి, జంపాన లక్ష్మీ, బానుమతి, విజయ కామేశ్వరి, పార్టీ ప్రతినిదులు కనకరాజు, ప్రకాష్, సంజీవరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమమే'

విజయనగరం కలెక్టరేట్ : ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమాలు చేపడతామని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో ఆస్తిపన్ను పెంచి ప్రజల నడ్డి విరిచిన ప్రభుత్వం పల్లె ప్రజలను ఇబ్బందులకు గురిచేయడానికి విద్యుత్ చార్జీలు పెంచాలని చూస్తోందని ఆరోపించారు. అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు ఆర్జించిన వారిని వదిలేసి పేద ప్రజలపై భారం మోపడం భావ్యం కాదన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రతినిధులు సి.హెచ్.అప్పలరాజు, కె.దయానంద్, టింవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులవి స్పష్టతలేని ప్రకటనలు

విజయనగరం టౌన్ : బాక్సైట్ తవ్వకాలతో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, తరతరాలపాటు గిరిజనులు గోచీలు పెట్టుకునే జీవించాలా అని రాష్ట్రమంత్రి, పీసీసీ అధ్యక్షుడు బొత్ససత్యనారాయణ చెప్పడం విడ్డూరంగా ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టిబాబ్జీ విమర్శించారు. ఆయన పార్టీ కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ సహజవనరుల

అభివృద్ధి పేరిట దోపిడీ చేసి గిరిజనులకు ఉన్న గోచీలను కూడా తీసేసే మార్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెతుకుతున్నాయన్నారు. బాక్సైట్ తవ్వకాలు ఎట్టిపరిస్థితిల్లోను జరగవని కేంద్రమంత్రి కిశోర్ చంద్రదేవ్ ప్రకటిస్తే, త్రవ్వకాలతోనే అభివృద్ధి చెందుతుందని బొత్స ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకేపార్టీలో వుండి ఒకేజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరిమధ్యన అవగాహన లోపం కనిపిస్తోందన్నారు. స్పష్టత లేని ప్రకటనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధి లక్కరాజు శివరామారావు పాల్గొన్నారు.

## చెరుకు రైతు సమస్యను అసెంబ్లీలో చర్చిస్తా

**కొత్తవలస :** చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చకు లేవనెత్తుతామని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక, అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆయన విశాఖపట్నం నుండి కొత్తవలస, ఎల్‌కోటల మీదుగా అరకు వెళ్తూ కొత్తవలస, ఎల్‌కోట జంక్షన్‌లలో కాసేపు చెరకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెరకు సాగుకు ఎంత ఖర్చు అవుతుందని, కోతకోసం మండలం సింగరాయి గ్రామానికి చెందిన నిరుజోగి రామునాయుడు తన సమస్యను జెపితో చెప్పుకున్నాడు. రైతుకు 1800 నుండి 2వేలు రూపాయల టన్నుకు ఇస్తుందని అది గిట్టుబాటు కాదని వాపోయారు. దీనిపై జేపీ స్పందిస్తూ 2500 నుండి 2700 వరకు ప్రభుత్వం చెరకు రైతుల చెల్లించాలని, దీనిపై తెలుసుకున్న ఎస్ఎస్ఎస్ ఆర్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చి వారి సమస్యలు చెప్పుకున్నారు. ఫీజు రియంబర్స్ మెంటు రాలేదని వాపోయారు. చేత కాని ప్రభుత్వం హామీలు ఇవ్వడమేతప్పు, అమలు చేయదని జెపి మండి పడ్డారు. విద్యార్థుల తరుపున అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతానని చెప్పారు. ఎల్‌కోట, మండలంలో లోక్‌సత్తా అధ్యక్షుడు డి. నాగార్జున, బి.గోవిందలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సత్యాగ్రహపాదయాత్రను జయప్రదం చెయ్యండి

### నంద్యాలలో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య పిలుపు

## కర్నూలు జిల్లా



**నంద్యాల :** రైతుల కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాటం మీదుగా రైతుల సత్యాగ్రహ పాదయాత్ర ఈనెల 18వ తేది ఎమ్మిగనూరు నుండి కర్నాటక గిల్కాసూగుర్ క్యాంప్ వరకు రాజకీయాలకు అతీతంగా డా॥జయప్రకాష్‌నారాయణ్ గారి నాయకత్వంలో చేపడుతున్న పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రములు స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో విడుదల చేయడమైనది. రైతులు పండించే ధాన్యం, చెరకు, పత్తి, పసుపు, శనగ, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, ఉల్లిపాయాలు, వగైర పంటలకు దేనికి లాభసాటిధర రావడంలేదు. రైతుల స్థితి పండినా దండగే, ఎండినా దండగే అయింది. ఇది కేవలం ప్రభుత్వ విధానాల శాపమే, దేశంలో ప్రపంచములో ఎక్కడ మంచి ధర వుందో అక్కడే అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా ప్రభుత్వం ఆంక్షలు విధిస్తున్నాయి. కావున శాసన ఉల్లంఘనచేసి ఎమ్మిగనూరు నుండి గిల్కాసుగూర్ క్యాంప్ (కర్నాటక) వరకు అమ్ముకునే స్వేచ్ఛ కోసం శాసన ఉల్లంఘన చేద్దాం రండి – కదలిరండి రైతు, మిత్రులు, బంధువులు ఈ పాదయాత్రలో పాల్గనండి. వంటలు వైరైనా రైతులంతా ఒక్కటే. ఈకార్యక్రమంలో రాష్ట్ర రాజకీయ శిక్షణ నిపుణులు శ్రీదర్ హాజరయ్యారు. నియోజక వర్గ ఇన్‌చార్జి యస్.ఎ.మజాద్, డా॥శంకర్‌రెడ్డి, డా॥ఎన్.రాముడు, సత్యనారాయణ్, పి.ఎన్.కృష్ణ,యువసత్తా నాయకులు, మహిళాసత్తా నాయకురాలు డి.రేఖ పాల్గొన్నారు.

# అవినీతిపై రాజీలేని పోరాటం




**రామలక్ష్మణకూడలి :** రాష్ట్రంలోని సంప్రదాయ రాజకీయ పార్టీలన్నీ మద్యం, గనుల మాఫియా చుట్టు తిరుగుతుంటే ఒక్క లోక్‌సత్తా పార్టీ మాత్రం అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడాల్సిన ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో కుమ్మక్కైందని ఆరోపించారు.

## శ్రీకాకుళం జిల్లా

ఇప్పటికైనా ప్రజలు, మేధావులు మౌనం విడిచి అడుగు ముందుకు వేయాలన్నారు. యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి.శివాజీరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువకిరణాలని, ప్రతిపక్షం యువతరంగాలనే పేరుతో మరో సారి యువతను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. మొన్న లోక్‌పాల్, నిన్న మద్యం సిండికేట్లు, నేడు సమాచార హక్కు చట్టం విషయంలో ఆయా పార్టీలు ఆడుతున్న నాటకాలు యువత మరిచిపోలేరన్నారు. అనంతరం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోలినాయుడు ఆధ్వర్యంలో ప్రరాపా నుంచి 34 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ విష్ణుమూర్తి, యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచాదిరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికలకు సిద్ధంకండి



**అముదాలవలస పట్టణం :** పురపాలక ఎన్నికలకు లోక్‌సత్తా సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి.హనుమంతురావు అన్నారు. అమదాలవలస పురపాలక సంఘ పరిధి తిమ్మాపురంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం సిండికేట్లు, అక్రమ ఇసుక వ్యాపారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు దోపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తుడుచిపెట్టుకు పోవడం ఖాయమన్నారు. పురపాలక సంఘాల అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏ పురపాలక సంఘంలో చూసినా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. పారిశుద్ధ్యం నివారణ అధ్వానంగా ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో మంత్రులు, కాంగ్రెస్ నాయకులు నిలువుదోపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అమదాలవలస పురపాలక సంఘంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.పోలీనాయుడు, రాష్ట్ర యువసత్తా నాయకులు పి.రాంబాబు, కార్యదర్శి కె.జగదీశ్వరరావు, నియోజక వర్గ ఇన్‌ఛార్జి తమ్మినేని అన్నంనాయుడు పార్టీ నాయకులు జి.సత్యనారాయణ, పూజారి షణ్ముఖరావు, జి.వి.ఆర్.కె.శర్మ, కరణం దామోదరరావు, సనపల ప్రసాదరావు, సంపతిరావు రాజు పాల్గొన్నారు.

# స.హ.చట్టం భారతీయులకు వరం

## గుంటూరు జిల్లా



**గణపవరం:** సమాచార హక్కు చట్టం భారతీయులకు లభించిన వరమని పీపుల్ ఫర్ లోక్‌సత్తా కార్యదర్శి రావిపాడు శ్రీకాంత్ అన్నారు. తోటకూర రామకోటయ్య బీఈడి కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. 2005 సమాచార హక్కు చట్టంతో ప్రభుత్వంలోని పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి నిర్మూలనకు దోహద పడుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ ఈ చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే అవినీతిని రూపుమాపవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తోటకూర వెంకటనారాయణ, పార్టీ నాయకులు అబ్దుల్ జబ్బార్, మురికిపూడి ప్రసాద్, వెంకట, ఖాదర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.




### ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలి

**చిలకలూరిపేట :** ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలంటూ లోక్‌సత్తా ప్రదర్శన నిర్వహించిన దాడుల్లో నిజాలు ప్రజలకు విస్తుపోయేలా చేశాయని, ప్రభుత్వం టెండర్లు రద్దుచేసి నిర్ణీత వేళల్లో మద్యం దుకాణాలను నడపాలని లోక్‌సత్తా నియోజకవర్గ కన్వీనర్ మదాసు భానుప్రసాద్ అన్నారు. పార్టీ అధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి రెవిన్యూ అధికారులకు వినతి పత్రం అంజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మారాణి, జిల్లా కార్యదర్శి దుర్గాదేవి, ప్రసాద్, ఆంజనేయులు, సాదిర్ పాల్గొన్నారు.



**మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్‌లో నిబంధనలు మార్చాలని ధర్నా చేస్తున్న ఆంధ్రా యూనివర్శిటీ విద్యార్థులు**

## జిల్లా వార్తలు - సూచనలు

**పట్టణాలు, మండలాల నుండి లోక్‌సత్తా టైమ్స్‌కు వార్తలు పంపేవారు ఈ క్రింది సూచనలు పాటించండి.**

1. పార్టీ, అనుబంధ ప్రజాసంఘాలు నిర్వహించిన ప్రజా కార్యక్రమాలను మాత్రమే పంపించండి. పేపర్ కటింగ్స్ పంపేవారు ఒకటి లేదా రెండు కటింగ్స్ మాత్రమే పంపండి.
2. పత్రికాప్రకటనలు, పత్రికాగోష్ఠుల వార్తల్ని ప్రచురించడం సాధ్యపడదు.
3. ప్రత్యేక సమస్యలు ఉంటే వాటి మీద వార్తా కథనాలు పంపండి.

# కులమతాలకతీతంగా సంఘటితమైతే మేలు : జేపీ

కులాన్ని, మతాన్ని, వర్గాన్ని పక్కనపెట్టి విద్యార్థులు సంఘటితమవ్వాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు ఎన్.జయప్రకాష్‌నారాయణ్ పిలుపునిచ్చారు. స్థానిక జమీందార్ ఫంక్షను హాలులో కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నేటి విద్యా విధానం దేశ ప్రగతిలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై ఆయన ప్రసంగించారు. మన దేశంలో తగిన వనరులు ఉన్నా, డబ్బున్న పిల్లలకు అవకాశాలు అందుతున్నాయి. మరికొంతమందికి బోటాబొటీగా, మిగతా పేదలకి అసలు దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయాలను వ్యాపారంగా మార్చినంత కాలం యువతకు ఉపాధి రాదని స్పష్టం చేశారు. ఎన్నికల కోసం నాయకులు ఎంత ఖర్చు పెడుతున్నారని విద్యార్థులను ప్రశ్నించగా... కోట్ల రూపాయలు అంటూ సమాధానమిచ్చారు. రాజకీయ నాయకులు ప్రజలను భ్రమపెట్టి కులం, మతంపేరుతో ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. నిజాయితీ గురించి మాట్లాడుతూ ఎవరైతే లంచం ఇస్తారో వారి సొమ్మూపోయి శని పట్టే పరిస్థితి రావాలన్నారు. ఏమి సాధించాలన్నా విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డైరక్టర్ కె.నాసరయ్య, హరిబాబు, లోక్‌సత్తా నేతలు గోపిచంద్, లలితకుమారి, నిర్మలాబోసు, చలచయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

## ఇంటింటా లోక్‌సత్తాలో సభ్యత్వ సేకరణ



### హైదరాబాద్ :

**దోమలగూడ :** ప్రస్తుత తరుణంలో మంచి పాలనను అందించగలిగేది లోక్‌సత్తా పార్టీ మాత్రమేనని రాష్ట్రపతి ఉత్తమ ఆచార్య అవార్డు గ్రహీత కంభంమెట్టు చెన్నకేశవరావు అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఇంటింటా లోక్‌సత్తా సేకరణ వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అశోక్‌నగర్ చమన్‌వద్ద ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కులమత ప్రాంతాలకు అతీతంగా పార్టీని ఆదరించాలని కోరారు. లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కొంగర గంగాధర్‌రావు, జీహెచ్‌ఎంసీ పార్టీ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, అనుమోలు రాఘవయ్య, రోహిత్‌కుమార్, బట్టుకోటేశ్వరరావు, రాజమనోహర్, మహేందర్, అక్బర్‌అలీ, అరుంధతీ, ఇందిర, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గంగాధర్‌రావు మాట్లాడుతూ ఇంటింటా లోక్‌సత్తా వందరోజుల కార్యక్రమాన్ని వివరించారు.

## FORM IV

1. Place of Publication : Hyderabad
2. Periodicity of its publication : Fortnightly
3. Printer's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
4. Publisher's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
5. Editor's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
6. Name and address of individual who own the news paper : Dr. Jaya Prakash Narayan
   Indian
   Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

and partners or shareholders holding More than one per cent of the total capital NA

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief

Date 16th February 2012 (Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher

# అనంతపురం బైపాస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లకు విజ్ఞప్తి



నగరంలోని కళ్యాణదుర్గం బైపాసు బ్రిడ్జి క్రింద పలుమార్లు ప్రమాదములు జరుగుచున్నవి. బైపాసు సమీపంలో నివసించుచున్న సామాన్య ప్రజలు లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలను కలిసి బైపాసు సమీపంలో జరుగుచున్న ప్రమాదములను నివారించుటకు అనంతపురం జిల్లా కలెక్టరు గారి గ్రీవెన్సు రోజున పురస్కరించుకుని జిల్లా కార్యకర్తలు శ్రీయుత ఐ.ఇస్మాయిల్, ఎమ్.అమర్‌నాథ్ ఎన్.సత్యనారాయణ, పి.నాగరాజు, వి.వెంకటలక్ష్మీ, రాఘవేంద్రమ్మ మొదలగు కార్యకర్తలతో కలెక్టరు మరియు జిల్లా జాయింట్ కలెక్టరుకు వినతి పత్రం సమర్పించినారు. ఆమె వెంటనే స్పందించి ఆ స్థలంలో స్పీడ్‌బ్రేకర్‌లను ఏర్పాటు చేసి ప్రజల అభీష్టమునకు ప్రమాదాల నివారణకు పనులు చేయుటకు జాయింట్ కలెక్టరు ఆదేశించినారు.

## ముడుపులు తీసుకున్న వారిపై చర్యలు

**గుంతకల్లు :**

మద్యం సిండికేట్ వ్యవహారంలో ముడుపులు తీసుకున్నవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ లోక్‌సత్తా అధ్యక్షులు మహమ్మద్‌గౌస్ అన్నారు. కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోకుండా జాప్యం చేయటం తగదన్నారు. మద్యం టెండర్ల విధానాన్ని రద్దుచేసి తమిళనాడు కర్ణాటకల్లోలాగా ప్రభుత్వం మద్యం షాపులను చేపట్టాలన్నారు. పార్టీ ప్రతినిధులు ఇస్మాయిల్, రాజు, మహమ్మద్‌అలి, సునీల్ రంగయ్య పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా



### భగత్‌సింగ్‌నగర్‌లో మెడికల్ క్యాంప్

లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో జనవరి 29వ తేది అనంతపురం నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కె.కొండయ్య, జె.శ్రీనాథ్, జె.ఆర్.శ్రీనివాసులు దాదాపు 210 మందికి చికిత్స చేసి, వారికి కావలసిన మందులను ఉచితంగా ఇవ్వడం జరిగింది. శ్రీమతి ఎన్.సరస్వతి, వి.వెంకటలక్ష్మీ, కె.రాఘవేంద్రమ్మ, శ్రీమతి పద్మ, మహిళల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్.అమర్‌నాథ్, వి.వన్నూరప్ప, రఘుపతి, నాగరాజు, మధు, నిజాంవలి, నాగేంద్ర పాల్గొన్నారు.

### మామిళ్లగూడెం రైతుబజార్ పరిస్థితి అస్తవ్యస్తం

**ఖమ్మం :** రైతు పండించిన కూరగాయలను నేరుగా అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రైతు బజార్ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని లోక్‌సత్తా పార్టీ ఆరోపించింది. రైతు బజార్‌ను పదిరోజుల పాటు సమగ్రంగా పరిశీలించిన అనంతరం జూపల్లి సత్యానారాయణ వివరాలు వెల్లడించారు. రైతు బజార్‌లో దళారుల ఆధిపత్యం నడుస్తోందని, సబ్సిడి వస్తువులను బయటి మార్కెట్‌కు తరలించి దళారులు సొమ్ముచేసుకుంటున్నారని మండిపడ్డారు. విక్రయశాలల అద్దెను ఆకస్మాత్తుగా 30 శాతం పెంచడం వల్లే డ్వాక్రా సంఘాల వారు స్టే తెచ్చుకున్నారని తెలిపారు. అధికారులు రైతుబజార్‌పై దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో యువసత్తా జిల్లా కార్యదర్శి భద్రూనాయక్, లక్ష్మణ్ నాయక్, నాగేందర్, బాలస్వామి, రహీం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమ పార్టీగా లోక్‌సత్తా

## యువసత్తా కార్యక్రమాలు

**ఆముదాలవలస :**
ఉత్తమ ప్రమాణాలు గల ప్రజాస్వామ్య సిద్ధాంత సుస్థిర పునాది గలిగిన ప్రజా ఉద్యమ పార్టీగా లోక్‌సత్తా అవతరించనుందని పార్టీ విభాగ యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు పి.శివాజీ రాజు అన్నారు. స్థానిక యువజన సదస్సులో యువత, ఉపాధి అవకాశాలు అన్న అంశంపై ప్రసంగించారు. రాష్ట్రంలో అవినీతిని పెంచి పోషించిన సాంప్రదాయ రాజకీయ పార్టీలు సామాన్య ప్రజలనే బలిపశువులుగా మారుస్తున్నాయని తప్పుబట్టారు. యువతకు ఉపాధి అవకాశాలపై జిల్లా రాజీవ్ యువకిరణాల విభాగం, డాటాప్రో సంస్థలచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచాది రాంబాబు, విశాఖపట్నం జిల్లా విద్యార్థి సత్తా నాయకులు అజిత్‌కుమార్, జిల్లా పార్టీ ఉద్యమ సంస్థ నాయకులు బి.సూర్యారావు, జిల్లా యువసత్తా బాధ్యులు జె.బాలరాజు, చిన్నంనాయుడు, పి.నర్సింగరావు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూ అవినీతి, అక్రమాలపై విచారణ నిర్వహించాలి

**జేఎన్‌టీయూ :** జేఎన్‌టీయూలో జరిగిన అవినీతి అక్రమాలపై సీబీఐతో విచారణ జరపాలని యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేలూరి అశోక్ డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూ అక్రమాలపై విచారణ కోరుతూ యువసత్తా ఆధ్వర్యంలో కళాశాల ప్రధాన ద్వారం వద్ద నిరాహార దీక్ష నిర్వహించారు. 2011లో జరిగిన అసోసియేట్, అఫ్‌స్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలలో భారీగా అక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, అనిల్, అశోక్, సోమనాథ్, మధు, సురేష్, వెంకటనాయుడు, నబీరసూల్, సరస్వతి, పద్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### అవినీతి నిర్మూలనకు రూపకర్తలు విద్యార్థులే

**కందుకూరు రూరల్ :** అవినీతి రహిత సమాజ స్థాపనకు విద్యార్థులే రూపకర్తలు కావాలని యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు పి.శివాజీరాజు విద్యార్థులకు సూచించారు. సమాచార హక్కు చట్టం, శక్తివంతమైన భారతదేశం కోసం యువతరాన్ని బలోపేతం చేయడం అనే అంశంపై అవగాహన సదస్సును ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో పీపుల్ ఫర్ లోక్‌సత్తా (పీఎఫ్ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఎ.శివరమేష్ రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని అందరూ వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరస్కరణ ఓటు ద్వారా రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన సాధ్యపడు తుందని పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ జీ. అయ్యన్న అభిప్రాయపడ్డారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.లక్ష్మణరావు, డైరెక్టర్ కంచర్ల శ్రీకాంత్, మూర్తి, మురళి పాల్గొన్నారు.

### లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఓటరు నమోదు

**బీచ్‌రోడ్డు :** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఆర్కేబీచ్‌లో ఓటరు నమోదు చేసుకొన్నారు. యువసత్తా అధికార ప్రతినిధి రామ్ శశిధర్, కిశోర్‌కుమార్, రాజశేఖర్ వర్మ, సోమేష్, ప్రసాద్, అజీత్ కుమార్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలి

**పెదవాల్తేరు :** యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని లోక్‌సత్తా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. 'నాయకత్వ లక్షణాలు' అనే అంశంపై చినవాల్తేరు లోక్‌సత్తా కార్యాలయంలో యువకులకు శిక్షణ ఇచ్చారు. దేశ నాయకులు భగత్‌సింగ్, నేతాజీ లాంటి వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో 500 మంది యువకులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. లోక్‌సత్తా పార్టీ రాజకీయాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తుందని అన్నారు. లోక్‌సత్తా నగర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రతినిధులు రామ్‌శశిధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.



జేపీ రైతు సత్యాగ్రహ పాదయాత్రకు మద్దతుగా
'బే ఏరియాలో (అమెరికా) పి.ఎస్.ఎల్ సంఘీభావం



పిఎస్ఎల్ నిర్వహించిన 'అవినీతి రహిత ఒంగోలు' - విద్యార్థులతో ప్రతిజ్ఞ


జేపీ పాదయాత్ర ఏర్పాట్లను చర్చిస్తున్న స్వతంత్ర రైతుల సంఘాల నేతలు


పార్వతీపురంలో మున్సిపల్ వార్డు శిక్షణ


విశాఖపట్నంలో యువసత్తా శిక్షణా కార్యక్రమం


విజయనగరం జిల్లాలో మున్సిపల్ వార్డు శిక్షణ


కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో
స.హ. చట్టంపై యువసత్తా కార్యక్రమం


ఆముదాల వలసలో యువజన సదస్సు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



నరసరావుపేట విక్టరీ కాలేజీ విద్యార్థులతో డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad